ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు జిల్లా వార్తలు 5
మంగళవారం 19 ఆగస్టు 2025


చేనేత మగ్గంపై జరీ అంచు పట్టుచీరల నేత పనిలో చేనేత కార్మికుడు

మాస్టర్ వీవర్స్‌కు చేయూత ఏదీ..?

- చేనేత కార్మికులకు ఉపాధి కల్పనలో కీలకం
- నిర్వీర్యమవుతున్న సహకార సంఘాలు
- అండగా నిలుస్తున్న మాస్టర్ వీవర్స్
- ప్రభుత్వ గుర్తింపు కోసం తాపత్రయం
- గుర్తింపు కార్డులు, రుణ సౌకర్యం కల్పించాలని విన్నపం
- 14 నెలలైనా అమలు కాని హామీ




అమ్మకానికి సిద్ధంగా చేనేత జరీ అంచు పట్టుచీరలు

వ్యవసాయం తరువాత అత్యంత మందికి ఉపాధి చూపిన రంగం చేనేత. మగ్గంపై ఆధారపడి ఉపాధి పొందుతూ వేలాది మంది చేనేత కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న మాస్టర్ వీవర్స్ (చేనేత కళకారుడు). సహకార సంఘాలు నిర్వీర్యమయ్యాయి. వేలాది మంది చేనేత కార్మికులు ఉపాధి లేక వీధినపడ్డారు. ప్రభుత్వాల చేయూత కరువై అర్ధాకలితో అలమటిస్తున్న నేతలకు మాస్టర్ వీవర్స్ అండగా నిలిచారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో నమ్ముకున్న చేనేతలకు భరోసా ఇచ్చారు. పట్టుచీరల క్రయవిక్రయాలు ఆగిపోయినా, చేనేత చీరల నిల్వలు పేరుకుపోయినా మగ్గం ఆపలేదు. అలాంటి మాస్టర్ వీవర్స్‌ను పాలకులు పట్టించుకోవడం లేదు. చేనేత జౌళి శాఖ వీరికి కనీసం గుర్తింపు కార్డులను జారీ చేయడం లేదు. వేలాది మందికి ఉపాధి కల్పించే 'మాస్టర్ వీవర్స్' మాత్రం పాలకులకు పట్టదు. జిల్లాలో మాస్టర్ వీవర్స్ ఆవేదనపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో చేనేత రంగానికి వందేళ్ల చరిత్ర ఉంది. 1938లోనే 'ఎమ్మిగనూరు చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం లిమిటెడ్ దివంగత పద్మశ్రీ మాచాని సోమప్ప స్థాపించారు. ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, నందవరం, నాగులదిన్నె, గుడేకల్లు, గూడూరు, నంద్యాల, కోవెలకుంట్ల, బనగానపల్లె, నందికొట్కూరు, వెలుగోడు, ఆత్మకూరు ప్రాంతాల్లో చేనేత మగ్గాలపై వస్త్రాలు ఉత్పత్తి చేస్తూ చేనేత కార్మికులు ఉపాధి పొందుతున్నారు. చేనేత మగ్గంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న చేనేత కుటుంబాలు 15-20వేలు వరకు ఉన్నాయని అంచనా. పాలకుల నిర్లక్ష్యం.. ప్రభుత్వాల చేయూత కరువై.. మరమగ్గాల పోటీ తట్టుకోలేక నమ్ముకున్న మగ్గాన్ని వదిలేసి వలసలు వెళ్లిన వారెందరో. ఒకనాడు వేలాది మందికి ఉపాధి కల్పించిన సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెరగడంతో ఆ సంఘాలు నిర్వీర్యమయ్యాయి. ఫలితంగా మగ్గం వదిలేసి.. ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కుంటున్న సమయంలో మేమున్నామంటూ చేనేతలకు మాస్టర్ వీవర్స్ అండగా నిలిచారు. పాతికేళ్లకు పైగా జరీ అంచు పట్టుచీరల తయారీలో నైపుణ్యం చాటుతూ మగువ మనసును దోచే పట్టుచీరల ఉత్పత్తిలో మాస్టర్ వీవర్స్ పాత్ర కీలకంగా మారింది.

ఒక్కో మాస్టర్ వీవర్ 25 నుంచి వందకు పైగా..

ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, నందవరం ప్రాంతాల్లో దాదాపు 125 మందికిపైగా మాస్టర్ వీవర్స్ ఉన్నారు. ఒక్కో మాస్టర్ వీవర్ 25నుంచి వందకు పైగా చేనేత మగ్గాలు కలిగి దాదాపు 5-6వేల మంది చేనేత కుటుంబాలకు ఉపాధి చూపుతున్నారు. మగ్గంపై పరోక్షంగా ఆధారపడిన డైయింగ్ (రంగులు) వేసే, పాగడ అతికే కార్మికులు, జరీ పాగడాలు వేసేవారు. ఇలా ఉపవృత్తి పొందుతున్న చేనేత కార్మికులు సరేసరి. మగువలు మెచ్చే డిజైన్లు తయారీ, మగ్గం, ముడి సరుకు సరఫరా మొదలు ఉత్పత్తి చేసిన జరీఅంచు పట్టు చీరలు విక్రయాలు బాధ్యత మాస్టర్ వీవర్స్‌దే. చీరలు అమ్ముడుపోయినా పోకపోయినా నేత కార్మికుడికి మాత్రం చీర నేసిన కూలీ డబ్బులు ఇవ్వాల్సిందే. మగ్గంపై చీర నేస్తే డిజైన్‌ను బట్టి ఒక్కో చీరకు కనిష్టంగా రూ.2,500, గరిష్టంగా రూ.6,500-7,000 వరకు చేనేతలకు కూలి చెల్లిస్తారు. ఒక చీర నేయడానికి భార్యాభర్త కష్టపడితే 5-10 రోజులు సమయం పడుతుంది. మాస్టర్ వీవర్స్ తాము బతుకుతూ వేలాది మంది చేనేత కార్మికులకు బతుకునిస్తున్నారు. అన్‌సీజన్‌లో చీరలు అమ్ముడుపోక, వ్యాపారులు మోసాలకు గురై తీవ్రంగా నష్టపోయిన మాస్టర్ వీవర్స్ ఎందరో ఉన్నారు. అయినా.. మరో వృత్తి తెలియక దీనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

మిగతా 6వ పేజీలో


చేనేత మగ్గంపై రూపుదిద్దుకున్న పట్టుచీరలు చూపుతున్న మాస్టర్ వీవర్ చుంచా చిన్న రంగస్వామి

విచారించి న్యాయం చేస్తాం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారించి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 83 ఫిర్యాదులు వచ్చాయి.

ఫిర్యాదుల్లో కొన్ని..

ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ ట్రైనర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి విజయవాడకు చెందిన ఎంద్రపల్లి శివ, కోవెలకుంట్లకు చెందిన మధ్యవర్తి రామకృష్ణ కలిసి ఐదుగురు నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఇప్పించుకొని మోసం చేశారని పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన రాజశేఖర్, నరేష్, లింగరాజు, పీటర్ పాల్, చైతన్య ఫిర్యాదు చేశారు. నకిలీ ఉద్యోగాలు ఇచ్చి ఏలూరులో ట్రైనింగ్ ఇచ్చి, ఆలూరులో 6 నెలల పాటు పని చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుమారుడిని కోడలు, ఆమె బంధువులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు గణేష్‌నగర్‌కు చెందిన అజ్మత్‌ఖాన్ ఫిర్యాదు చేశారు. ఆదోని సబ్ రిజిస్టర్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి దేవదానం, జ్యోతి కలిసి రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశారని కౌతాళం మండలం చిరుతపల్లి గ్రామానికి చెందిన రాజు, మునిస్వామి ఫిర్యాదు చేశారు. కొడుకు, కోడలు తమను కొట్టి పొదుపులో వచ్చిన డబ్బులతో పాటు బంగారం తీసుకెళ్లారని తుగ్గలి మండలం గుండాల్ తండాకు చెందిన దానమ్మ, రాముడు నాయక్ దంపతులు ఫిర్యాదు చేశారు. మద్యానికి బానిసై తల్లిదండ్రులు ఇచ్చిన ఆస్తిని తమ సోదరుడు శివరాజ్ ఇతరులకు విక్రయించారని స్వామిరెడ్డి నగర్‌కు చెందిన తిరుపాల్ ఫిర్యాదు చేశారు. బాబు అనే వ్యక్తి తన దుకాణం ఎదుట కూరగాయల బండి పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు చౌక్ మసీదుకు చెందిన నజీర్ అహ్మద్ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత


నియామక పత్రాలు అందజేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు

కర్నూలు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. సుధీర్‌బాబు అందజేశారు. నగరంలోని ఆయన కార్యాలయంలో సోమవారం సీఐలు రాజేంద్రప్రసాద్, చంద్రహాస్, సిబ్బందితో కలిసి జూనియర్ అసిస్టెంట్లుగా నియమితులైన డి. హైమావతి, కె. సౌమ్యకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు ఫయాజ్ బాషా, సత్యవతి, ఇస్మాయిల్ బాషా పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్



కర్నూలు అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కర్నూలులోని క్లస్టర్ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను నియమించినట్లు ఇన్‌చార్జి వీసీ వి. వెంకటబసవరావు తెలిపారు. ఇక్కడ రిజిస్ట్రార్‌గా పని చేసి తన పదవీ కాలం పూర్తి చేసుకుని తన మాతృ సంస్థ యోగివేమన వర్సిటీకి వెళ్తున్న ప్రొఫెసర్ కట్టా వెంకటేశ్వర్లుకు సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, అధ్యాపకులు ఆయనకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రాయలసీమ వర్సిటీ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ నాయుడు, వర్సిటీ డీన్‌లు అక్తర్ బాను, నాగరాజు శెట్టి, కంట్రోలర్ బాలసుబ్రహ్మణ్యం, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, అధ్యాపకులు బంగారుబాబు, హరీష్‌కుమార్, సిల్వర్ జూబ్లీ కళాశాల అధ్యాపకుడు ఎల్లాకృష్ణ పాల్గొన్నారు.

ఆ అధికారులపై చర్యలు తీసుకోండి

- పీజీఆర్ఎస్ అర్జీలను గడువులోపు పరిష్కరించాలి
- కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశం


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించని ఆదోని మున్సిపల్ కమిషనర్, జిల్లా రిజిస్ట్రార్, వక్ఫ్‌బోర్డు కర్నూలు ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా డీఆర్వోను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలన్నారు. నగరంలోని వారు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ వద్ద 18 రోజుల నుంచి ఒక అర్జీ పెండింగ్‌లో ఉందని, సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే కర్నూలు సబ్ రిజిస్ట్రార్ వద్ద 14 రోజుల నుంచి ఒక అర్జీ, గూడూరు మున్సిపల్ కమిషనర్ వద్ద 12 రోజుల నుంచి, క్రిష్ణగిరి తహసీల్దార్ వద్ద 3 అర్జీలు 7 రోజుల నుంచి, తుగ్గలి తహసీల్దార్ వద్ద 2 అర్జీలు 7 రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సంబంధిత అధికారుల మీద తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. అర్జీలు చూడని అధికారులకు కేవలం మెమోలు మాత్రం ఇవ్వడం కాదని, మెమో ఇచ్చిన తర్వాత కూడా అలాగే పెండింగ్‌లో ఉంటే.. వారిని సస్పెండ్ చేసేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 11, కర్నూలు ఆర్డీవో వద్ద 7, పత్తికొండ ఆర్డీవో వద్ద 7, కలెక్టరేట్ ఏవో వద్ద 3, సర్వే ఏడీ వద్ద ఒక దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నుంచి సోమవారం 90వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, మంగళవారం ఉదయానికి సుంకేసుల రిజర్వాయరుకు 1.20 లక్షల 2 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో తుంగభద్ర డ్యాం నుంచి నీటి విడుదలపై కలెక్టర్ సమీక్షిస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నుంచి జిల్లా సరిహద్దుగా ఉన్న కౌతాళం మండలం మేళిగనూరు వరకు నీరు వచ్చిందన్నారు. వీఆర్వోల ద్వారా గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు అప్రమత్తం చేయాలని సబ్ కలెక్టర్, ఆర్డీవోలను ఆదే శించారు. నదీతీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో కూడా లోతట్టు ప్రాంతాలకు నీరు వచ్చే అవకాశం ఉందని, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

జీడీపీకి జలకళ

- ప్రస్తుతం ప్రాజెక్టులో 2.010 టీఎంసీల నీరు
- రబీలో సాగుకు ఇబ్బంది ఉండదని ఆయకట్టు రైతుల ఆనందం
- పలు ప్రాంతాలకు తీరనున్న తాగునీటి సమస్య

గోనెగండ్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల జీవనాడి అయిన గాజులదిన్నె ప్రాజెక్టు వరద నీటితో కళకళలాడుతోంది. పది రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల జీడీపీకి రోజూ వరద వచ్చి చేరుతోంది. సోమవారం సాయంత్రంకు జీడీపీలో 2.010 టీఎంసీ(లైవ్) నీరు ఉన్నట్లు జీడీపీ ఇరిగేషన్ ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు. హంద్రీ-నీవా నుంచి రోజుకు 120 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అలాగే తుంగభద్ర దిగువ కాలువ నుంచి రోజుకు 60 క్యూసెక్కుల నీరు చేరుతోంది. సోమవారం ఒక్కటే ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి దాదాపు వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టును చేరింది. మూడేళ్లుగా వరద నీరు వచ్చి చేరలేదు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, రాతన, తదితర ప్రాంతాలలో వర్షం కురవడంతో వరద నీరు వచ్చి చేరుతోంది. తెర్నేకల్లు వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అక్కడి నుంచి కూడా నీరు జీడీపీలోకి చేరుతోంది. ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలకు ఇక నీటి ఇబ్బంది ఉండదు. పత్తికొండ, డోన్, క్రిష్ణగిరి తాగునీటి పథకాలకు, అవసర సమయంలో కర్నూలు, కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ప్రాంతాలకు కూడా తాగునీటి కోసం నీటిని విడుదల చేస్తారు. ఇక వచ్చే రబీకి నీటి కష్టాలు తీరుతాయని ఆయకట్టు రైతుల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కింద 24,500 ఎకరాలు రబీలో సాగుకావాల్సి ఉంది. జీడీపీలోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో వచ్చే ఏడాది ఆయకట్టు భూములకు సాగు ఇబ్బంది లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


గాజులదిన్నె ప్రాజెక్టుకు చేరిన వరద

ఫొటో.. మధుర జ్ఞాపకం

- గత స్మృతులకు ఆనవాలు ఫొటోలు
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

వైభవం.. సిద్ధేశ్వరస్వామి రథోత్సవం

6

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

- నేడు స్థానాల కేటాయింపు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించనుంది. ఈ మేరకు 120 మంది పంచాయతీ కార్యదర్శులుకు గ్రేడ్-5 నుంచి గ్రేడ్-4 పదోన్నతులు లభించనున్నాయి. గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్యదర్శుల పదోన్నతుల తుది జాబితాను ప్రకటించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు నూతన స్థానాల కేటాయింపునకు పంచాయతీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, కొంతమంది బినామీలను ఏర్పాటు చేసుకుని వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మరి కొందరు అధికారుల పేర్లు చెప్పి వసూళ్లకు పాల్పడడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈఅంశంపై ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం కొసమెరుపు.

త్వరలో కొత్త బార్లు

- జిల్లాలో 23 బార్‌ల ఏర్పాటుకు నోటిఫికేషన్
- 26వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- 28న జిల్లా పరిషత్‌లో లాటరీ పద్ధతిలో ఎంపిక
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు


మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు

కర్నూలు అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): 2025-28 బార్ నూతన పాలసీకి నోటిఫికేషన్‌జారీ చేశారు. సోమవారం ఉదయం కలెక్టర్ రంజిత్‌బాషా ఈ ప్రక్రియలో గీత కార్మికులకు మూడు బార్లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. వీటికి సంబంధించిన నోటిఫికేషన్ రెండు రోజుల్లో జారీ కానుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. సుధీర్‌బాబు తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ తన చాంబర్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నూతన బార్ పాలసీ విధి విధానాలు వెల్లడించారు. జిల్లాలో 23 బార్లకు నోటిఫికేషన్ జారీ అయిందని తెలిపారు. ఈ ప్రక్రియకు సంబంధించిన ఈనెల 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 28న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా లాటరీ పద్ధతిలో బార్ల ఎంపిక ప్రక్రియ సాగుతుందని తెలిపారు. ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు, ఆపైన ఉంటేనే లాటరీ పద్ధతికి అర్హత ఉంటుందని, ప్రతి దరఖాస్తుదారుడు దరఖాస్తు రుసుం(నాన్ రీఫండబుల్) రూ.5 లక్షలు, రూ. 10 వేలు ప్రాసెసింగ్ రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రిటైల్ దుకాణాలతో పోలిస్తే తక్కువ లైసెన్సు ఫీజు ఉంటుందని తెలిపారు. 50 వేల జనాభా ఉన్న ప్రాంతంలో రూ.35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 55 లక్షలు, 5 లక్షలు పైబడి ఉన్న ప్రాంతాల్లో రూ. 75 లక్షల చొప్పున లైసెన్సు రుసుం ఉంటుందని తెలిపారు. లాటరీ ద్వారా పారదర్శకతను ప్రోత్సహిస్తుందని, అవకతవకలకు అవకాశం లేకుండా చేస్తుందని, తక్కువ ఖర్చుతో కొత్త వారికి ఈజీ ఆఫ్ డూయింగ్ ఉంటుందని, రుసుంను వాయిదాల రూపంలో చెల్లించే వెసులు బాటు ఉందని తెలిపారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో బార్లు దక్కించుకున్న వారు నగరం చుట్టు పక్కన 10 కిలోమీటర్లలోపు ఎక్కడైనా బార్లను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. గీత కులాలకు కేటాయించిన బార్లలో రెండు కర్నూలు నగరంలో ఈడిగ-1, గౌడ్-1, ఆదోని పట్టణంలో ఈడిగ-1 కులానికి బార్లను కేటాయించారు. బార్లకు మూడేళ్ల పాటు అనుమతులు ఉంటాయని చెప్పారు. దరఖాస్తుదారులు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంతో పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, ప్రొఫెసనల్ పద్ధతిలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరు ఈ-రిసిప్ట్‌తో లాటరీ ప్రక్రియకు వెళ్లాలని తెలిపారు. సమావేశంలో సీఐలు రాజేంద్ర ప్రసాద్, చంద్ర హాస్ పాల్గొన్నారు.




నీలి హంద్రీ

సోమవారం సాయంత్రం ఆకాశం నీలిరంగులో దర్శనమిచ్చింది. దీంతో కర్నూలు నగరం నడిబొడ్డున ప్రవహిస్తున్న హంద్రీనది సైతం నీలిరంగులో తన రూపాన్ని మార్చుకుని కాసేపు ఇలా కనువిందు చేసింది.
- కర్నూలు (ఆంధ్రజ్యోతి)

ఫొటో.. మధురజ్ఞాపకం

- గత స్మృతులకు ఆనవాలు ఫొటోలు
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

కర్నూలు కల్చరల్/ ఆత్మకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఫొటో.. రెండక్షరాల ఈ పదం ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండిపోయేలా చేస్తుంది. వెయ్యి మాటలు చెప్పలేని భావాన్ని ఒక ఫొటో చెబుతుంది. వర్తమాన అంశాలను భవిష్యత్ తరాలకు అందిస్తుంది. మధుర జ్ఞాపకాలని తరతరాలకు భద్రపరుస్తుంది. పండుగలు, వివాహాలు, వేడుకలు, విహారాలు, విషాదాలు, సాహసాలు.. అన్నింటికీ ఫొటో సాక్ష్యంగా నిలుస్తుంది. ప్రతి ఫొటో వెనుక ఓ జ్ఞాపకం.. ఓ కథ.. ఓ అనుభూతి దాగి ఉంటుంది. అలనాటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ తనివితీరా వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చేవి ఫొటోలు మాత్రమే. అందుకే ప్రస్తుత దైనందిన జీవితంలో ఫొటోగ్రఫీ ఒక భాగంగా మారింది. ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతుంటే పాత ఫొటో ఒకటి చూస్తే చాలు కాలం వెనక్కు వెళ్లి ఏళ్లనాటి మధురస్మృతులు మనసులో మెదలుతాయి. కెమెరా కంటితో చూసిన ఒక అందమైన దృశ్యాలకు శాశ్వత రూపాన్ని తీసుకువచ్చే కళాకారులే ఛాయా చిత్రకారులు. పువ్వుల్నీ, పసిపాపల నవ్వుల్నీ, జడివాన చినుకుల్నీ, జలపాతాల ఒరవడిని ఇలా హృదయాన్ని స్పందింపజేసే ఏదైనా సరే.. చిత్రంగా ఆవిష్కరించాలని పరితపించే కళాకారుడే ఫొటోగ్రాఫర్. ఇంతటి తియ్యని గుర్తుల ముద్రలు వేసే ఫొటోగ్రఫీ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఓ ముఖ్యమైన రోజు ఉంది. ఫొటోగ్రఫీ పితామహుడు విలియం హెన్రీఫాక్స్ సేవలకు గుర్తుగా ప్రతి ఏటా ఆగస్టు 19వ తేదీన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ప్రపంచ దేశాలన్నీ నిర్వహిస్తున్నాయి.



సెల్ఫీతో కొత్త పుంతలు

దశాబ్దాలుగా ఫొటోలు తీయడం ఎన్నో దశలను దాటుతూ వస్తోంది. ఫొటోగ్రఫీకి ప్రధానంగా కావాల్సింది సృజనాత్మకత. అలాగే కెమెరా కన్ను ఉండాలి. మార్పులు ఎన్ని వచ్చినా జీవితంలో ఫొటోతో విడదీయలేని బంధమే. స్మార్ట్ ఫోన్లు వచ్చాక ఫొటోగ్రఫీ మరీ తేలిక అయిపోయింది. ఇక సెల్ఫీ ఫొటోగ్రఫీ కొత్త పుంతలు తొక్కుతోంది. కొన్ని సందర్భాల్లో సెల్ఫీల విపరీత పోకడలతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో ఫొటోల పిచ్చిపేరుతో ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. రైలు వెళ్తుండగా సెల్ఫీ తీస్తూ, ఉధృతంగా ప్రవహిస్తున్న నదీతీరంలో ఫొటోలు తీయడం, బైక్‌లపై విన్యాసాలు చేస్తూ సెల్ఫీలు తీసుకునే క్రమంలో యువత ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో తమ ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నారు. సెల్ఫీ పిచ్చి పేరుతో ప్రాణాలపై తెచ్చుకుని తల్లిదండ్రులకు శోకాన్ని మిగుల్చుతున్నారు. ఫొటో ఫ్యాషన్ కావాలే కానీ.. ప్రాణాలు తీసుకునేలా ఉండకూడదని ఫొటోగ్రాఫర్లు హెచ్చరిస్తున్నారు.



13 ఏళ్లుగా సామాజిక సేవలో...

ఎస్‌కే బాషా, కల్లూరు ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాల ద్వారా తాము ఉపాధి పొందడమే కాదు, కొందరు సామాజిక సేవల్లోనూ ముందుంటున్నారు. మేము గత 12 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తొలుత పేద ఫొటోగ్రాఫర్ల సహాయార్థంగా చేపట్టిన ఈ సామాజిక సేవా కార్యక్రమాలు ఇతరులకూ విస్తరించాం. సంఘ సభ్యులంతా సంపాదించిన సొమ్ములో 30శాతం సామాజిక సేవలకు వినియోగించాలనేది మా అభిమతం. అలా 2012 నుంచి సేవలు కొనసాగిస్తున్నాం.



ట్రైసైకిల్, ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రస్తుతం 62 మందికి ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.200 చొప్పున పింఛన్లను అందిస్తున్నాం. వికలాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్నాం.

ఆందోళనలో అన్నదాతలు

- జిల్లాలో వారం నుంచి ఎడతెరిపిలేని వానలు
- నీటి నిల్వతో తెగుళ్ల బారిన పంటలు



వర్షం నీటిలో ఉన్న పైర్లు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వర్షం కోసం ఎదురు చూసినప్పుడు చినుకే లేక కన్నీరు మున్నీరైన రైతులు ప్రస్తుతం ఎడతెరిపి లేని వర్షాలతో పంటలు చేతికి అందుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. కళ్ల ముందే పైర్లు నీటిలో మునిగిపోతుంటే.. ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు. వారం రోజులుగా పైర్లు నీటిలోనే ఉండటంతో వాటికి క్రిమికీటకాలు, తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. వాటి నివారణకు ఏం చర్యలు తీసుకోవాలో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఉండిపోతున్నారు. ఎలాగైనా పొలాల్లోని నీటిని బయటకు తోడేయకుంటే రైతులకు నష్టం తప్పదని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. ఆగస్టు 25 నాటికి 52.5 మి.మీ. వర్షం మాత్రమే కురవాల్సి ఉండగా.. దాదాపు మూడు రెట్లు ఆగస్టు 18నాటికే కురవడంతో పొలాలన్నీ నీటిమయమైపోయాయి. సోమవారం నాటికి జిల్లాలో 140.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో రెండు, మూడు రోజుల పాటు ఇదే స్థాయిలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. పైర్లను కాపాడుకునేందుకు రైతులు తక్షణ చర్యలు చేపట్టాలని జేడీ వరలక్ష్మి తెలిపారు. సోమవారం ఓర్వకల్లులో 24.4 మి.మీ., ఎమ్మిగనూరులో 21.8, కౌతాళంలో 12.8 , గోనెగండ్లలో 11.2, మంత్రాలయంలో 10.6, కోడుమూరులో 10.2, గూడూరులో 10, దేవనకొండలో 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ఫిలాటలీ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఫిలాటలీ(స్టాంపుల సేకరణపై అవగాహన) స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరిటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు స్టాంపుల సేకరణపై అవగాహన కల్పించడానికి ఎన్నో రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి దీన్ దయాళ్ స్పర్శ్ యోజన ద్వారా స్కాలర్‌షిప్ పరీక్షను సెప్టెంబరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. వీరందరూ గడిచిన విద్యా సంవత్సరం 2024-25లో 60 శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మార్కులలో 5 శాతం రాయితీ ఉంటుందని సూచించారు. ఈ పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుందని, ఉత్తీర్ణత పొంది విజయం సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.6 వేలు స్కాలర్‌షిప్ అందిస్తారని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు వ్యక్తిగతంగా, పాఠశాల ప్రిన్సిపాల్ ద్వారా ఫిలాటలీ డిపాజిట్ అకౌంట్‌ను రూ.200తో ప్రధాన తపాలా కార్యాలయంలో తెరిచి ఆ వివరాలను దరఖాస్తులకు జతపరచి ఒక కవరులో సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, కర్నూలు డివిజన్, కర్నూలు-518001కు పంపాలని కోరారు. కవరుకు ఫిలాటలీ స్టాంప్‌ను అతికించి స్పీడ్ పోస్టు ద్వారా మాత్రమే పంపాలన్నారు. ఒక కవరులో ఒకే దరఖాస్తు ఉండాలన్నారు. దరఖాస్తులను సెప్టెంబరు 19లోపు చేరవేయాలని, అదే నెలలోనే పరీక్ష ఉంటుందని చెప్పారు. మరిన్ని వివరాలకు ప్రధాన తపాలా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మాస్టర్ వీవర్స్‌కు చేయూత ఏదీ?



మగువ మనుసు దోచే డిజైన్లలో చేనేత పట్టుచీరలు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేసి సంక్షేమ పథకాలు అందిస్తుంది. మాస్టర్ వీవర్స్‌ను చేనేత కార్మికులుగా గుర్తించడం లేదు. డైయింగ్ కార్మికులు, వార్పు, పాగడాలు వేయడం, అతికే కార్మికులను కూడా గుర్తించపోవడంతో ప్రభుత్వ పథకాలు వారికి అందని ద్రాక్షగా మారాయి. చేనేత నైపుణ్యం ఉన్నా సరైన ప్రోత్సాహం లేక ఇబ్బందులు పడుతున్నారు. మమ్ములను చేనేతలుగా గుర్తించండి.. ప్రోత్సాహకాలు అందించి ఆదుకోవాలని విన్నపాలు బుట్టదాకాలు అవుతున్నాయి. గత ఎన్నికల ముందు ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాల్లో మాస్టర్స్ వీవర్స్‌కు అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. మంగళగిరి తరహాలో చేనేతలతో పాటుగా మాస్టర్ వీవర్స్ చేయూత అందిస్తామని టీడీపీ స్పష్టమైన హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

ప్రధాన డిమాండ్లు ఇవే

- మాస్టర్ వీవర్స్‌ను ప్రభుత్వం గుర్తించాలి. చేనేత జౌళి శాఖ ద్వారా గుర్తింపు కార్డులు జారీచేయాలి. అన్‌సీజన్ సమ యంలో పట్టుచీరలు అమ్ముడుపోక నిల్వలు పేరుకుపోతున్నాయి. నేతన్నకు ఉపాధి చూపాలంటే అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. పావులావడ్డీకి స్వల్పకాలిక, దీర్ఘకాలిక బ్యాంక్ రుణాలు ఇచ్చి ఆర్థిక భరోసా ఇవ్వాలి. పట్టు (సిల్క్), రంగులు కొనుగోళ్లపై రాయితీ ఇవ్వాలి.
- మాస్టర్ వీవర్స్ ఉత్పత్తి చేసే చేనేత పట్టుచీరలు, ఇతర వస్త్రాలపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలి. సహకార సంఘాలతో సంబంధం లేకుండా పారిశ్రామికవేత్తల తరహాలో మాస్టర్ వీవర్స్‌కు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి.

మాకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



మాస్టర్ వీవర్‌గా మరో 30-40 మంది చేనేతలకు ఉపాధి కల్పిస్తున్నాం. మార్కెట్ పోటీని తట్టుకోవాలంటే ఆకట్టుకునే డిజైన్లు ఎంతో ముఖ్యం. చీరలు అమ్ముడుపోయినా పోకపోయినా నేత నేసిన నేతన్నకు కూలీ డబ్బులు ఇవ్వాల్సిందే. లేదంటే వారి కుటుంబ పోషణ కష్టంగా మారుతుంది. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని రాణిస్తున్న మాస్టర్ వీవర్స్‌కు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలి.

- సి. చిన్న రంగస్వామి, మాస్టర్ వీవర్, ఎమ్మిగనూరు

రాయితీపై పట్టు సరఫరా చేయాలి



మా తాతల కాలం నుంచి చేనేత వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. మాస్టర్ వీవర్‌గా 35ఏళ్ల నుంచి నేను ఉపాధి పొందుతూ మరో 35మంది చేనేతలకు ఉపాధి కల్పిస్తున్నా. ప్రభుత్వం పొత్రాహం, గుర్తింపు ఇవ్వాలి. పట్టుచీరల తయారికి కీలకమైన పట్టు (సిల్క్), రంగులపై ప్రభుత్వం రాయితీలు ఇచ్చి మాస్టర్ వీవర్స్‌ను కూడా ఆదుకోవాలి.

- ఎం. రాఘవేంద్ర, మాస్టర్ వీవర్, కోడుమూరు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



జిల్లాలో మాస్టర్ వీవర్స్ గుర్తింపు కార్డులివ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఇవ్వడానికి అవకాశం లేదు. మాస్టర్ వీవర్స్‌కు గుర్తింపు కార్డులు జారీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. సహకార సంఘంగా ఏర్పడితే వారికి నూలు, సిల్క్‌పై 15 శాతం రాయితీ, 8 శాతం త్రిఫ్ట్ ఫండ్ వస్తుంది. ముద్ర రుణాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. చేనేత వస్త్ర ఉత్పత్తిదారుడిగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌డీసీ) నుంచి నూలు, సిల్క్ తీసుకునే అవకాశం ఉంది. దీనిపై మాస్టర్ వీవర్స్‌కు అవగాహన కల్పిస్తాం.

- నాగరాజరావు, ఏడీ, చేనేత, జౌళి శాఖ, కర్నూలు

కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు హోంశాఖ మంత్రి అభినందనలు



చంద్రశేఖర్

మహానంది, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కారులో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ చిన్నారిని కాపాడిన కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సామా జిక మాధ్యమంలో అభినందనలు తెలిపారు. మహానంది పోలీస్‌స్టేషన్‌కు చెందిన చంద్రశేఖర్ ఆదివారం ఆలయ పరిసరాల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన ఓ కుటుంబం మహానందీశ్వరుని దర్శనం కోసం వచ్చారు. ఏడాది వయస్సున్న చిన్నారిని కారులో ఉంచి కారుకు తాళం వేసి దర్శనం కోసం ఆలయానికి వెళ్లారు. కారులో ఉన్న చిన్నారి ఊపిరాడక, చెమటలు పట్టి గుక్కపట్టి ఏడుస్తుండటాన్ని స్థానికులతో పాటు ఆలయ ఉద్యోగి ఈశ్వర్ గమనించారు. వెంటనే కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు విషయం తెలిపారు. ఆయన ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డికి సమాచారం అందించి కారు అద్దాలు పగల కొట్టి చిన్నారిని రక్షించారు. విషయం తెలుసుకున్న హోం మంత్రి అనిత కానిస్టేబుల్‌కు అభినందనలు తెలిపారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

- కలెక్టర్ రాజకుమారి



ఎగ్ కార్ట్‌లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం పీజీఆర్‌ఎస్ హాల్ వద్ద డ్వాక్రా మహిళలు ఇదాయతున్, కళ్యాణికి కలెక్టర్ ఎగ్ కార్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం డీఆర్‌డీఏ, వెలుగు శాఖల ద్వారా స్వయం సహాయ సం ఘాలకు ఎగ్ కార్ట్‌లను అందిస్తుందన్నారు. జిల్లాకు 100 కార్ట్‌లు అందజేయల్సి ఉండగా అర్హత కలిగినవారికి 40 ఎగ్ కార్ట్‌లను ఉచితంగా ఇచ్చారు. ఒక్కొక్క ఎగ్ కార్ట్ రూ.50వేల విలువ చేస్తుందన్నారు. డ్వాక్రా మహిళల్లో తోపుడు బండ్లమీద బజ్జీలు, పకోడీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారో వారిని గుర్తించి ఎగ్ కార్ట్‌లను అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అందులో తప్పకుండా ఎగ్ వెరైటీ ఫుడ్స్ చేయాలని సూచించారు.

నిరుద్యోగులకు అండగా నిలవాలి

- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



ఆర్థిక మంత్రితో మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకాన్ని చిన్న జిల్లాలకు కూడా వర్తింపజేసి నిరుద్యోగులకు అండగా నిలవాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. సోమవారం ఢిల్లీలో పార్లమెంట్‌లో ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద నంద్యాల జిల్లాకు 372 దరఖాస్తులకు అనుమతివ్వగా ఇంతవరకు 3000 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో 30 మందికి మాత్రమే ఉద్యోగ అవకాశం కల్పించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవ కాశం కల్పించే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ఆర్థిక మంత్రితో భేటీ

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌నుఎంపీ బైరెడ్డి శబరి పార్లమెంట్ ప్రాంగణంలోని మంత్రి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కి కావాల్సిన ఆర్థిక తోడ్పాటును కల్పించాలని కోరినట్లు ఎంపీ తెలిపారు. కేంద్రమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవం.. సిద్ధేశ్వరస్వామి రథోత్సవం



ఆలూరులో సిద్దేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలిసిన సిద్ధేశ్వరస్వామి రథోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలూరు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. వీరశైవ లింగాయతీ వర్గానికి చెందిన భక్తులు ప్రత్యేక పూలదండను స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రవిశంకర రెడ్డి, ఎస్‌ఐ మహబూబ్‌బాషా, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మహానందిలో దోపిడీ పర్వం

- అన్నదానం నుంచి.. ఉచిత మరుగుదొడ్ల వరకు ఆగని దందా
- చక్రం తిప్పుతున్న ఇద్దరు అధికారులు
- అడ్డదారిలో జీతాలు డ్రా
- మంత్రి ఆదేశాలు బేఖాతరు



భక్తులకు ఉచిత అన్నదానం (ఫైల్)

నంద్యాల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): మహానంది పుణ్యక్షేత్రంలో దోపిడీ పర్వం కొనసాగుతోంది. కొంత కాలంగా పలు రకాల అవినీతి, అక్రమాలు సాగుతున్నాయని ప్రచారం జోరందుకుంది. ఉచిత అన్నదానం నుంచి మరుగుదొడ్ల వరకు ఎక్కడ పడితే అక్కడ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అంతటితో ఆగకుండా ఏకంగా అడ్డదారిలో ఉద్యోగుల పేరుతో జీతాలు డ్రా చేసి క్యాష్ చేసుకుంటున్నారని వినికిడి. ఇటీవల ఆశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి మహానందిలో పర్యటించగా ఉచిత మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని ఆదేశించారు. రెండు మూడు రోజులు నిర్వహించి తర్వాత షరా మాములే.. భక్తులను నిత్యం దోపిడీ చేస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో సదరు ఆలయంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారుల పాత్ర ఎక్కువగా ఉందని ఆ వర్గాల నుంచి తెలుస్తోంది. ఏది ఏమైన పవిత్ర పుణ్యక్షేత్రమైన మహానంది క్షేత్రంలో పలు రూపాల్లో అవినీతి అక్రమాలు జరుగు తుండటం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖ మంత్రి అదేశాలనే బేఖేతారు చేయడం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా మహానందికి విచ్చేస్తున్న ఆశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ సైతం సదరు అక్రమాలపై దృష్టిసారిస్తారా? లేదా సందేహాలు లేకపోలేదు. ఏది ఏమైనా పలు రూపాల్లో భక్తులతో పాటు అన్నదానం రూపంలో దోపిడీకి తెర లే పడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



ఉచిత మరుగుదొడ్ల బోర్డు ఇలా..

అన్నదానం అడపాదడపాగా నిర్వహించి

మహానంది పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల కోసం దేవాదాయ శాఖ ఉచిత అన్నదానం సదుపాయం అమలు చేస్తోంది. ఈనేపథ్యంలో ప్రతి రోజు 500 మంది భక్తుల వరకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. అయితే క్షేత్రం సమీపంలో ఉండే హోటళ్ల నిర్వాహకులతో కుమ్మక్కై ఉచిత అన్నదానం అడపాదడపాగా నిర్వహించి మమ అన్పించేస్తున్నారని సమాచారం.

అడ్డదారిలో జీతాలు డ్రా....

పుణ్యక్షేత్రం పలు పనుల కోసం ఓ ఏజెన్సీ ద్వారా ఉద్యోగులను తీసుకుని పనులు చేయిస్తుండటం జరుగుతోంది. గతంలో మరుగుదొడ్ల టెండర్లు దక్కించుకుని రూ.లక్షలు ఎగ్గొట్టిన టెండరుదారుల సమీప బంధువులను(ఇద్దరు మహిళలు) ఏజెన్సీ తరుపున ఉద్యోగంలో చేర్పించారు. వారు విధులకు రాకపోయిన నెలనెల జీతాలు డ్రా చేస్తున్నారు.

అవినీతి, అక్రమాలకు బరితెగించారనే..

అవినీతిలో ఆలయంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారుల పాత్ర కీలకంగా ఉందని సమాచారం. ఆఇద్దరు అధికారుల్లో ఒకరు రూ.లక్షలు వెచ్చించి ఇక్కడ పోస్టింగ్ పొందారనే విమర్శలు లేకపోలేదు. తద్వారా ఇష్టారాజ్యంగా మహానందీ ఆలయంలో అవినీతి అక్రమాలకు బరితెగించారనే ఆరోపణలు లేకపోలేదు.

పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే..

మహానంది క్షేత్రంలో జరిగే అవినీతి అక్రమాలపై పట్టించుకునే నాథుడే కరువయ్యారనే ఆరోపణలు లేకపోలేదు. దేవాదాయ శాఖ ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్ మంగళవారం మహానంది పుణ్య క్షేత్రానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఈయనైనా ఈ వ్యవహారాలపై దృష్టిసారిస్తారా..? లేది అనే సందేహాలు భక్తుల్లో లేకపోలేదు.

భళా.. ఎల్ల లింగ



220 కేజీల ఇసుక బస్తాను ఎత్తుతున్న మడినల్ ఎల్ల లింగ



175 కేజీల గుండు ఎత్తుతున్న కప్పగల్ కర్ణ

- 220 కేజీల ఇసుక బస్తా ఎత్తిన యువకుడు
- 175 కేజీల రాతి గుండు ఎత్తిన కప్పగల్ కర్ణ
- కందుకూరులో బలప్రదర్శన పోటీలు

కోసిగి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఏపీతో పాటు కర్నాటక రాష్ట్రానికి చెందిన గ్రామీణ యువకులు పాల్గొన్నారు. 220 కేజీల ఇసుక బస్తా ఎత్తే పోటీలో కర్ణాటక చెందిన మడినల్ ఎల్ల లింగా అనే యువకుడు ఇసుక బస్తాను ఎత్తి విజేతగా నిలిచారు. అలాగే మరియప్ప నాయక్ అనే యువకుడు 200 కేజీల ఇసుక బస్తాను ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. 175 కేజీల రాతిగుండును కర్ణాటకకు చెందిన కప్పగల్ కర్ణ అనే యువకుడు ఎత్తి శభాష్ అనిపించుకున్నాడు.

ఏడు కిలోమీటర్ల పరుగు పందెం పోటీల్లో పెద్దతుంబళం గ్రామానికి చెందిన ఈరన్న అనే యువకుడు మొదటి స్థానంలో నిలిచాడు. పెద్దతుంబళం గ్రామానికి చెందిన తిమ్మప్ప రెండో స్థానంలో నిలిచాడు. వీరికి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. బల ప్రదర్శనలు తిలకించేందుకు వేలాది మంది ప్రజలు చూడడానికి తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, ముత్తురెడ్డి, రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, చిన్న తాయన్న, నర్సారెడ్డి, తోవి రామకృష్ణ, జ్ఞానేష్, గాలెం వీరేష్ రామిరెడ్డి, కురువ అయ్యన్న, రామలింగ, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో పోటీలను తిలకిస్తున్న టీడీపీ నాయకులు

యువతి బలవన్మరణం

గడివేముల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని పెసరవాయి గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన గాయత్రి(30) నల్గొండ జిల్లాలోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా పని చేస్తోంది. ఐదేళ్లుగా పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మానసికంగా కుంగిపోయింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంఎస్ నగర్‌లోని లలిత్ కుమార్ (19) ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివీ.. ఎంఎస్ నగర్‌కు చెందిన లలిత్‌కుమార్ కారు మెకానిక్‌గా పనిచేసేవాడు. మద్యానికి బానిస కావడంతో తండ్రి ఈరన్న మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన లలిత్ కుమార్ సోమవారం ఉదయం తన ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దొంగల ముఠా అరెస్టు

- ఆరుగురి నుంచి రూ.2.10 లక్షల నగదు, 15 లీటర్ల సారా, భారీగా కాపర్ కేబుల్ స్వాధీనం



నిందితులను చూపుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ రైల్వే లైన్ కేబుల్ చోరీకి పాల్పడిన ముఠా సభ్యులను సోమవారం అరెస్టు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. ఈ మేరకు నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టారు. మీర్జాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు, పిక్కిలి రామచంద్రుడు, పిక్కిలి వెంకటసుబ్బయ్య, వెంకటనరసింహనాయుడు, కళ్యాణ్‌కుమార్ తో ఓ బాలుడిని గ్రామంలోని సుంకులమ్మగుడి వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.2.10 లక్షలు నగదు, 15 లీటర్లు సారా, పెద్ద ఎత్తున రైల్వే లైన్ కాపర్ కేబుల్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించినట్లు తెలిపారు. ఈకేసులో మరికొంత మంది నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. ఎస్ఐ గోపాల్, పోలీసులు శేషు, గోపాల కృష్ణ పాల్గొన్నారు.

వైద్యులే అన్నీ తామై..

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రాణపాయస్థితిలో వచ్చిన ఓ రోగికి నా అనే వారు ఎవరూ లేకపోయినా వైద్యులే అన్నీ తామై వ్యవహరించి ప్రాణాలు కాపాడారు. రోగికి ఆపరేషన్ చేసేందుకు కుటుంబ సభ్యులు అనుమతి, సంతకాలు చేయాలన్నా నిబంధనలు ఉన్నప్పటికీ ఆ రోగికి సంబంధించిన వారు లేకపోవడంతో వైద్యులు సాహసంతో ప్రాణాన్ని కాపాడేందుకు బంధువుల అనుమతి లేకుండానే ఆపరేషన్ చేశారు. కర్నూలు కొత్తబస్టాండు సమీపంలో నిర్మల హోటల్‌లో ఒంగోలుకు చెందిన రవి అనే వ్యక్తి పని చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడగా తీవ్రగాయాలయ్యాయి. రోగిని 108లో హుటాహుటిన తీసుకువచ్చారు. సర్జరీ వైద్యులు పరీక్షలు నిర్వహించగా.. రోగి కడుపుకు తీవ్రగాయమైనట్లు, ప్లీయం దెబ్బతిన్నట్లు గుర్తించారు. వెంటనే ఆపరేషన్ చేయాలని జనరల్ సర్జరీ మొదటి యూనిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్ అహ్మద్.. సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ హరిచరణ్‌కు కేసు పరిస్థితిని వివరించారు. రోగి ప్లీహం తొలగించాలని, లేకుంటే రోగి బతికే పరిస్థితి లేదని తేల్చారు. ప్లీహం తొలగించాలంటే బంధువుల అంగీకారం ఉండాలి. ఆ సమయంలో బంధువులు ఎవరూ లేకపోవడంతో సర్జరీ హెచ్‌వోడీ హరిచరణ్ సూచనల మేరకు కేసు వివరాలను సీఎస్ఆర్ఎంవో వెంకటరమణకు వివరించారు. సీఎస్ఆర్ ఎంవో కూడా రోగి ప్రాణాన్ని కాపాడాటం ముఖ్యమని వెంటనే ప్లీయం తొలగించాలని సూచించడంతో అసిస్టెంట్ ప్రొఫెసర్ అబ్దుల్ అహద్ రోగికి సోమవారం తెల్లవారుజామున ఆపరేషన్ చేసి ప్రాణాన్ని కాపాడారు. ప్రస్తుతం రోగిని సర్జరీ ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

దంపతుల ప్రాణాలు కాపాడారు

- ఎస్సార్బీసీ కాలువలో దూకడానికి భార్యాభర్తల నిర్ణయం
- రక్షించిన పోలీసులు



ఎస్సార్బీసీ వద్ద దంపతులను రక్షించిన ఎస్ఐ దుగ్గిరెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక బనగానపల్లె పట్టణ సమీపంలోని ఎస్సార్బీసీ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని భావించిన దంపతులను బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బంది కాపాడిన ఘటన సోమవారం జరిగింది. వివరాలివీ.. కడప జిల్లా మైదుకూరు సమీపంలోని జంగంపల్లె గ్రామానికి చెందిన మద్దిలేటి, శశికళ దంపతులు అవుకు మండలంలోని రామాపురం గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే అప్పులు అధికం కావడంతో జీవితంపై విరక్తి చెంది బనగానపల్లె సమీపంలోని రవ్వలకొండ సమీపంలోని ఎస్సార్బీసీ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని భావించారు. కాలువలో దూకే ముందు శశికళ తన సమీప బంధువు చిన్నమద్దిలేటికి ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో ఆయన వెంటనే బనగానపల్లె సీఐ ప్రవీణ్ కుమార్‌కు ఫోన్ చేసి తన అన్న, వదిన ఆత్మహత్య చేసుకో బోతున్నారని సీఐ ప్రవీణ్ కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ దుగ్గిరెడ్డిని, పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సహకారంతో లొకేషన్ ద్వారా బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బంది నాగచంద్రుడు, రమణయ్య బనగానపల్లె పట్టణ సమీపంలోని రవ్వలకొండ వెళ్లే మార్గంలోని ఎస్సార్బీసీ కాలువ వంతెనపై దంపతులు ఉన్నట్లు గుర్తించారు. అక్కడి వెళ్లి దంపతులను బనగానపల్లె సీఐ ప్రవీణ్ కుమార్ వద్దకు తీసుకు వచ్చి విచారించారు. తమకు రూ.3 లక్షల అప్పు ఉందని, ఆ అప్పు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు దంపతులు తెలిపారు. దంపతులిద్దరికీ సీఐ కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డిని, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, డోన్ డీఎస్పీ శ్రీనివాస్ అభినందించారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

కర్నూలు క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్టాండులో చోరీ చేసిన ఇద్దరు నిందితురాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు నగరం వడ్డెగేరికి చెందిన షేక్ ఖాజాబి, షేక్ ఫరీదాబీను అరెస్టు చేసి వారి నుంచి 4 తులాల బంగారు గొలుసు రికవరీ చేసినట్లు సీఐ విక్రమసింహ తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలానికి చెందిన విమలమ్మ అనే వృద్ధురాలు ఈ నెల 13వ తేదీన కర్నూలు వచ్చారు. కొత్తబస్టాండులో ఆత్మకూరు వెళ్లేందుకు బస్సు ఎక్కే ప్రయత్నం చేస్తుండగా.. ఆమె చేతిబ్యాగులో ఉన్న పర్సు చోరీకి గురైంది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాళ్లను గుర్తించారు. వీరి వద్ద నుంచి బంగారు గొలుసును రికవరి చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.



నిందితులను చూపుతున్న పోలీసులు

జీవో 23ని రద్దు చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పర్యాటక అభివృద్ధి సంస్థలోని 22 హోటళ్లను ప్రైవేట్‌పరం చేయాలని తీసుకువచ్చిన జీవో నెంబరు 23ని రద్దు చేయాలని ఏపీ టూరిజమ్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. జీవోకు వ్యతిరేకంగా సోమవారం వెంకటరమణ కాలనీ హరిత హోటల్ ఆవరణలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాజశేఖర్ మాట్లాడుతూ గత రెండన్నర దశాబ్దాలుగా పని చేస్తున్న ఉద్యోగ భద్రత లేదన్నారు. ఉద్యోగులకు క్రమబద్ధీకరించకుండా హోటళ్లను ప్రైవే టుకు దారాదత్తం చేయడం సరికాదన్నారు. హోటళ్లను ఆధునిక వసతుల కల్పన పేరుతో రూ.159 కోట్లు బ్యాంకుల ద్వా రా రుణం తీసుకుని వాటి మరమ్మతులు పూర్తి చేసి ప్రైవేటుకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో శ్రీనివాసయాదవ్, జామవా, సుధాకర్, ఆంజనేయులు, సరిత, సుగుణదేవి, జయరామ్, ఎన్.రావు, సురేష్ పాల్గొన్నారు.

కేఎంసీలో అ‘పూర్వ’ సమ్మేళనం

- 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న కర్నూలు వైద్య కళాశాల విద్యార్థులు
- గురువులకు సన్మానం



2000వ బ్యాచ్‌కు చెందిన కేఎంసీ పూర్వ విద్యార్థులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కేఎంసీ(కర్నూలు మెడికల్ కాలేజీ)లో 2000వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మెడికల్ కాలేజీలోని న్యూ ఆడిటోరియంలో జరిగింది. సోమవారం కేఎంసీ 2000 బ్యాచ్‌కు చెందిన 150 మందిలో 80 మంది పూర్వ విద్యార్థులు అమెరికా, ఇంగ్లాండు, దుబాయి, ఆస్ట్రేలి యాతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వైద్యులు టైటాన్స్ రీయూనియన్ పేరుతో కలుసుకున్నారు.

25 ఏళ్ల అనంతరం కలుసుకుని వైద్యులు ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమ భవిష్యత్తును తీర్చిదిద్దిన గురువులు కంటి వైద్యులు డా.పి.సుధాకర్‌రావు, సీనియర్ ఫిజిషియన్ డా.భవానీప్రసాద్, డా.గిడ్డయ్య, డా.విష్ణుప్రసాద్, పథాలజి హెచ్‌వోడీ డా.బాలేశ్వరి, కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. అనంతరం కాలేజీ అంతా తిరిగారు. కార్యక్రమంలో 2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కార్డియాలజిస్టు డా.పి.ప్రశాంత్, డా.శివబాల, డా.జాన్ (హైదరాబాదు), డా.ఫణికిషోర్, డా.రాఘవ, డా.సుబ్బారెడ్డి(యూఎస్ఏ), డా.అర్చన్, డా.హేమలత, కార్డియాలజిస్టు డా.మహ్మద్ ఆలి వైద్యులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె

ఓర్వకల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన కురువ పెద్దమల్లయ్య మట్టి మిద్దె సోమ వారం ఉదయం కుప్పకూలింది. కుటుంబ సభ్యులు బయటి వరండాలో ఉండగా.. వంట గది కుప్పకూలింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.



పాలకొలనులో కూలిన మట్టి మిద్దె



జీవో 23ని రద్దు చేయాలి



పున్నమి రెస్టారెంట్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఓర్వకల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): టూరిజం సంస్థను ప్రైవేటు పరం చేయడం సరికాదని, తక్షణమే జీవో నెంబరు 23ను రద్దు చేయాలని టూరిజం మేనేజర్ సువర్ణ కుమారి అన్నారు. సోమవారం ఓర్వకల్లు గ్రామ సమీపంలోని రాక్ గార్డెన్ ఎదురుగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు రెండున్నర శతాబ్దాల నుంచి సంస్థను నమ్ముకుని పని చేస్తున్నా మన్నారు. ఉద్యోగ భద్రత, సరైన జీతభత్యాలు లేకపోయినా ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. జీవో 23ను ప్రభుత్వం తెచ్చి ప్రైవేటు సంస్థకు ఉపయోగించేలా నిర్ణయం తీసుకోవడం బాధాకర మన్నారు. కార్యక్రమంలో నాగరాజు, కార్తీక్, బోస్, చంద్రశేఖర్, బసప్ప, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మానికి 22 అర్జీలు వచ్చాయి. కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తుల పరి ష్కారంలో జాప్యం జరుగుతుంటే దానికి కారణాలేంటో సంబంధిత అర్జీదా రుడికి వివరించాలన్నారు అంతకుముందు గార్గేయపురం డంప్‌యార్డులో ఘన వ్యర్థాలతో 15 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన ప్లాంట్ నిర్మాణ ప్రక్రియపై జపాన్ దేశానికి చెందిన నిపుణులతో కమిషనర్ చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, డీఈఈ క్రిష్ణలత, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

● పూడికతీత కార్మికులకు జీతాలు పెంచాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వైవీ రమణ డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

ఓర్వకల్లు: ఓర్వకల్లులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ విద్యాసాగర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ మా ట్లాడుతూ దరఖాస్తులను ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. ఎంఈవో ఓంకార్ యాదవ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్దమార్కెట్ సమీపంలోగల శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మంటపంలో మంగళవారం ఉదయం 10గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహ ర్‌రావు తెలిపారు. సోమవారం నగరంలోని సమాఖ్య జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పేద వర్గాలకు చెందిన బ్రాహ్మణ యువతకు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై ఈసమావేశంలో చర్చించేందుకు ఈసమావేశం ఏర్పాటు చేశామన్నారు. కోనూరు సతీష్ శర్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సమాఖ్య మాజీ అధ్యక్షుడు పెద్దిభొట్ల లక్ష్మీనారాయణ, గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర, కరివేన నిత్యాన్న భోజన సత్రం కార్యదర్శి డాక్టర్ నవలూరి వేణుగోపాల్, విశ్రాంత ఇంటర్ బోర్డు ఆర్ఐవో క్రిష్ణిపాటి రంగనాథ శర్మ, సమాఖ్య సీనియర్ సభ్యుడు పి. వెంకటరావు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని అన్ని వర్గాలు, శాఖలకు చెందిన బ్రాహ్మణులు ఈ సమావేశానికి హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. సామూహిక మంగళ గౌరీ వ్రతం మహిళలతో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఆహ్వాన కమిటీ ప్రతినిధులు ఇస్కాల సురేష్‌కుమార్, హెచ్‌కే రాజశేఖ ర్‌రావు, కల్లే చంద్రశేఖర శర్మ పాల్గొన్నారు.

కష్టపడితేనే ఫలితం



మాట్లాడుతున్న కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కష్టపడితేనే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని కళాశాల చైర్మన్, లయన్స్ కేవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఒరి యంటేషన్ కార్యక్రమం జరిగింది. కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే చదువులో రాణిస్తారన్నారు. కరస్పాండెంట్ విజయలక్ష్మి మాట్లాడుతూ మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్ర మంలో పూర్వ విద్యార్థి డీఎస్పీ ఎస్ఎండీ అజీజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సుబ్బారెడ్డి, డీన్ కరుణకుమార్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిమేల్ మెడికల్ వార్డులో రోగుల అవస్థలు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పాత గైనిక్ విభాగంలోని ఫీమేల్ మెడికల్ యూనిట్లలో కనీస సౌకర్యాలు లేక మహిళా రోగులు అవస్థలు పడుతున్నారని కర్నూలు జీజీహెచ్ హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యుడు సాయి ప్రదీప్ తెలిపారు. సోమవారం పాత గైనిక్ విభాగంలోని ఫీమేల్ మెడికల్ ఐదు, ఆరు, ఏడో యూనిట్లను ఆయన తనిఖీ చేశారు. రోగుల బాత్‌రూములకు తలుపులు కూడా లేవని, నీటి సరఫరా కూడా రోజులో ఒక గంట మాత్రమే నీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాత్ రూములో నీరు బయటకు వెళ్లకపోవడంతో దుర్వాసన వస్తుందని, ఫ్యాన్లు లేక దోమల బెడదతో రోగులు అల్లాడిపోతున్నారన్నారు.

ప్రభుత్వ క్వార్టర్స్‌లో అనధికార వ్యక్తుల నివాసం

● లంబాడీ సంఘం జాతీయ కార్యదర్శి యోగేష్‌నాయక్
● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు సమస్య విన్నవిస్తున్న పుల్లారెడ్డి

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏ, బీ, సీ క్యాంపులోని ప్రభుత్వ క్వార్టర్స్‌లో కొన్నేళ్లుగా అనధికార వ్యక్తులు నివాసం ఏర్పాటు చేసుకున్నారని లంబాడీ సంఘం జాతీయ కార్యదర్శి యోగేష్ నాయక్ ఆరోపించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాటా డుతూ క్వార్టర్స్‌ను కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కేటాయించాలని కోరారు. ఒక్కో ప్రభుత్వ ఉద్యోగికి నాలుగు నుంచి ఐదు క్వార్టర్స్ వరకు రెవెన్యూ అధికారులు కేటాయించారని విమర్శించారు. నిబంధనల మేరకు ఒక ప్రభుత్వ ఉద్యోగికి ఒక క్వార్టర్స్‌ను మాత్రమే కేటాయించాలన్నారు. ఒక ఉద్యోగి నాలుగైదు క్వార్టర్స్ తీసుకోవడంతో మిగతా ప్రభుత్వ ఉద్యోగులు అర్హత కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వ క్వార్టర్స్‌లో అక్రమంగా నివసిస్తున్న వారిని తొలగించి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను వసూలు చేయాలన్నారు.

● నగరంలోని ఉల్చాల రోడ్డు నుంచి పెద్దపాడు వరకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు పుల్లారెడ్డి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రం నుంచి కోడుమూరు, పత్తికొండ, బళ్లారి, ఆదోని మంత్రాలయం, ఎమ్మిగనూరు ప్రాంతాలకు వెళ్లే దారిలో ఉల్చాల రోడ్డు నుంచి పెద్దపాడు వరకు రోడ్డు మార్గాన వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వినతిలో పేర్కొన్నారు.

● రాష్ట్రంలో మత్స్యకారులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోన అప్పలరాజు అన్నారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టర్ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సాయిప్రదీప్, ముని, చేపల రమేష్, వెంకటేశ్వర్లు, మద్దికెర సిద్దప్ప, ఉయ్యాలవాడ శ్యాం, పవన్ పాల్గొన్నారు.

● నగరంలో టౌన్ మోడల్ కళాశాలలో తాగునీటి, మరుగుదొడ్ల సదుపాయాలు, క్రీడా మైదానాన్ని పునరుద్ధరించాలంటూ భీమ్ ఆర్మీ రాష్ట్ర కన్వీనర్ విజయభాస్కర్ కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.

● ఎమ్మిగనూరు పట్టణంలో ఎస్సీ కమ్యూనిటీల అవసరాల నిమిత్తం బీఆర్ అంబేద్కర్ భవన నిర్మాణానికి కేటాయించిన 1.60 ఎకరాల స్థలాన్ని శుభ్రం చేసి ఎస్సీలకు అప్పగించాలని బహుజన సివిల్ రైట్స్ ఫోరమ్ నాయకులు దిలీప్ కుమార్, మహేష్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

● 2019-20లో ఎమ్మిగనూరు పట్టణంలో కరోనా రోగులకు మూడు పూటల ఆహారాన్ని మా సంస్థ వేదాస్ (విలేజ్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ యాక్షన్ సొసైటీ) ద్వారా అందించామని, అందుకుగానూ రూ.12.50 లక్షలు టూరిజం శాఖ ద్వారా బిల్లులు రావాల్సి ఉందని వేదాస్ ప్రెసిడెంట్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ అవాస్తవం
● ఎంఈవో ఓంకార్ యాదవ్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

ఓర్వకల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్, సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూవో మద్దిలేటి అన్నారు. ఓర్వకల్లు ఎస్సీ వసతి గృహంలో ఫుడ్ పాయిజన్‌పై సోషల్ మీడియా వైరల్ అవుతుందని, అది అవాస్తవమన్నారు. ఈ విషయంపై సోమవారం ఎంఈవో, ఏఎస్‌డబ్ల్యూవోలు వసతి గృహానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు విద్యార్థులకు వాంతులయ్యా యని, అంతేగాని ఎలాంటి ఫుడ్ పాయిజన్ జరగలేదన్నారు. రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని, కుళ్లిపోయిన కూరగాయలు పెడుతున్నారని, భోజనం కూడా నాణ్యతగా లేదని విద్యార్థులు వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అయ్యన్నలు వసతి గృహాన్ని సందర్శించి సమస్యలు విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ధర్నాకు బయటకు పంపాలని వార్డెన్ సుంకన్నను కోరగా.. ఆయన ససేమిరా అనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆర్‌వీఎఫ్ నాయకుడు రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సుధాకర్, మహబూబ్‌బాషా తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టి తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు.

వార్డెన్‌ను మందలించిన ఎమ్మెల్యే: ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందకపోవడంతో ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి వార్డెన్ సుంకన్నను ఫోన్‌లో మందలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

కర్నూలు రూరల్ ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌతమ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగంలో డా.బీఆర్ అంబేడ్కర్ పొందుపరిచిన ఆర్టికల్ 340 ప్రకారం 1953లో వారి స్థితిగతులపై కాక కళ్యాణ్‌కర్క మిషన్ అప్పటి ప్రభుత్వాలకు నివేదికను ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఆ కమిటీలు అమలుకు నోచుకోవడంలేదని ఆయన ఆరోపించారు. జిల్లా ఇన్‌చార్జిలు బొగ్గుల వనుమన్న, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కాన్షీరాం 1991లో ఢిల్లీలో బీసీల హక్కుల కోసం దాదాపు 40రోజుల పాటు ధర్నా చేస్తూ తక్షణమే మండల కమిషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సామేలు, రామలింగయ్య, సలహాదారులు సుంకన్న, శాంతిరాజు, నాయకులు మధుకర్, బంగారప్ప పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం

గూడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం కొనసాగుతుందని మాజీ జడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం గూడూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే కార్యాచరణపై ఆదోని పట్టణంలో ఎమ్మె ల్యే డాక్టర్ పార్థసారధి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగిందన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై గూడూరు వాల్మీకులు ఎప్పుడు ముందు ఉంటారన్నారు. కార్యక్రమంలో పట్టణ వాల్మీకులు పాల్గొన్నారు.

జాతీయ చిహ్నాం సర్కిల్ ప్రారంభం

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయ సముదాయ ప్రాంగణంలో సోమవారం నవీకరించిన జాతీయ చిహ్నాం సర్కిల్, ఫౌంటెన్‌తో కూడిన పార్కు, నూతనంగా నిర్మించిన సువిధ శానిటరీ కాంప్లెక్స్‌ను కలెక్టర్ రంజిత్ బాషా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ సుందరీకరణలో భాగంగా ముఖ భాగంలో జాతీయ చిహ్నాం సర్కిల్, ఫౌంటెన్‌తో కూడిన పార్కులను నవీకరించామన్నారు. కలెక్టరేట్ కాంప్లెక్స్ సుందరంగా, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కలెక్టర్‌ను కోరిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు కలెక్టర్ రంజిత్‌బాషాను కోరారు. సోమవారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేవని, అందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జగన్నాథగట్టు జర్నలిస్టుల స్థలాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. 2009లో జగన్నాథగట్టుపై సొసైటీ పేరుతో ఇళ్ల స్థలాలు ప్రభుత్వ ధరకు కొనుగోలు చేశామన్నారు. కానీ అక్కడ మౌలిక వసతులు లేవన్నారు. అక్కడ మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యుడు కె.నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, నాయకులు ఎన్వీ సుబ్బయ్య, వైవీ కృష్ణారెడ్డి, శ్రీనివాసగౌడ్, దస్తగిరి, శివరాజ్‌కుమార్, సుధాకర్, రఫీ, అంజి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛన్లు ఇవ్వాలి

కోడుమూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు ఇవ్వాలని వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయుడు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాముడుకు సోమవా రం వినతి పత్రం అందజేశారు. సురేష్ నాయుడు మాట్లాడుతూ రీ సర్వే పేరుతో సదరం క్యాంపు మండలంలోని దాదాపు 30 మందికి పింఛన్లు నిలిపివేశారన్నారు. దివ్యాంగులకు మరోసారి సదరం నిర్వహించి అర్హులైన వాళ్లకు పింఛన్‌ను పునఃరుద్దరించాలని కోరారు. రాజశేఖర్, రుబీనా, కృష్ణవేణి, మాదన్న, సురేష్ పాల్గొన్నారు.

పాపన్న గౌడ్ సేవలు మరువలేనివి

కర్నూలు అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు మరువలేనివని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కేఈ విజయకుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నగరంలోని గౌడ సంఘం కార్యాలయంలో పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాసాని మహేస్ గౌడ్, జనరల్ సెక్రటరీ ఈడిగ సురేష్ గౌడ్, కోశాధికారి నాగశేషన్న గౌడ్, పడిదంపాడు శంకర్ గౌడ్, జనార్ధ గౌడ్, ఈడిగ రామక్రిష్ణ, జలంధర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కరుణ, దయ కలిగి ఉండాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కరుణ, దయ కలిగి ఉండాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ భవానీ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో కరుణ క్లబ్ కర్నూలు కేంద్రం వారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సిల్వర్‌జూబ్లీ కాలేజీ అధ్యాపకురాలు పార్వతి, జైన్ మాజీ చైర్మన్లు మణిలాల్, నాగరాజు, అరవింద్ బండారి, జితేంద్ర మహిత్, రవీంద్ర జైన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో బంకులను తొలగించాలి

సి.బెళగల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని వేసుకున్న బంకులను తొలగించాలని పంచాయతీ అధికారులు సోమవారం బంకులకు నోటీసులు అతికించారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సునీల్‌రాణి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలలో బంకులను వారంలోపు తొలగించకుంటే ఎక్స్‌కవేటర్‌తో వాటిని తొలగిస్తామన్నారు. గ్రామంలో బంకులు వేసుకున్న యజమానులకు వారం రోజుల క్రితం నోటీసులను పోస్టుద్వారా పంపినట్లు తెలిపారు.

ఘనంగా నేతాజీ వర్ధంతి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగ స్వామి నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యా పకులు రామకృష్ణ, విజయశేఖర్, జబీన్ అక్తర్, ఉల్లోజిరావు పాల్గొన్నారు.

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం

కల్లూరు మండలంలో 39.5 మి.మీ. నమోదు





తడకనపల్లె రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వర్షం నీరు, అనుగొండ వద్ద పత్తి పొలంలో నిలిచిన నీరు

కల్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రాత్రి నుంచి ఏకధాటిగా మండలంలో 39.5 మీ.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. వాగులు, వంకలు ప్రవహిస్తుండగా పంట పొలాల్లో నీరు నిలిచి జోము తీస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి తడకనపల్లె రైల్వేబ్రిడ్జి కింద వర్షం నీరు నిలిచి రాకపో కలకు అంతరాయం ఏర్పడి ప్రజలు అవస్థలు పడ్డారు.

కోడుమూరు రూరల్: మండలంలో కురుస్తున్న వర్షాలతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. పొలాల్లో తేమ ఆరడం లేదు. దీంతో కలుపు తీవ్రత పెరిగింది. వరుసగా పడుతున్న వర్షాల తో పత్తికాయలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు బోరుబావుల కింద సాగు చేసిన ఉల్లి చేతికందడంతో పలువురు రైతులు పీకి ఉంచారు. అయితే వర్షాల కారణంగా కోత జరగడం లేదు. టమోట, చౌళ వంటి కూరగాయ పంటల పరిస్థితి అలాగే ఉంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఏకధాటిగా ఉదయం వరకు వర్షం పడింది. దీంతో లోతట్టు పొలాల్లో వర్షపునీరు నిలిచింది. ఉదయాన్నే రైతులు గట్లు తెంచడానికి పొలాలకు పరుగులు పెట్టారు.

హెల్మెట్ తప్పనిసరి: ట్రాఫిక్ సీఐ

కర్నూలు క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ సూచించారు. సోమవారం నగరంలో సి.క్యాంపు, బళ్లారి చౌరస్తా, రాజ్‌విహార్ పలు కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాటికి, హెల్మెట్ ధరించని 150 మందిపై జరిమానా విధించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిని ఆపి అరగంట సమయం ఇచ్చి హెల్మెట్‌లు తెచ్చుకున్న తర్వాత వారికి ఒక రోజా పూవ్వు ఇచ్చి హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు.

ఘనంగా నందికోల ఉత్సవం

కల్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కల్లూరు ఈశ్వర వీరభద్ర స్వామి ఆలయంలో శ్రావణమాస నందికోల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆఖరి సోమవారం ఆలయంలో వీరశైవ లింగాయతి సమితి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, నందికోల గంగాస్నానం, మహానైవేద్యం, మంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. కల్లూరు వీధుల్లో నందికోల విన్యాసాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి గుర్రెడ్డి, వీరశైవ లింగాయతి సమితి అధ్యక్షుడు చంద్రశేఖరప్ప, సభ్యులు పెద్ద లక్ష్మయ్య, యల్లయ్య, శంకర్, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

ట్రంప్ టారిఫ్ విధానాన్ని వ్యతిరేకించాలి

కోడుమూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇండియాకు విధించిన 50శాతం సుంకాలను వ్యతిరేకించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శేషకుమార్ అన్నారు. స్థానిక కోట్ల సర్కిల్లో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇది ఇలా ఉంటే ట్రంప్ ఇండియాపై అధిక సుంకాలు విధించడం దారుణమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు ముని స్వామి, గోవిందు, బజారి మద్దిలేటి పాల్గొన్నారు.

ఫొటోస్టాట్ పేపర్లతో కళాశాలలకు అనుమతులా?

కర్నూలు అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న బీఈడీ కళాశాలలకు ఫొటోస్టాట్ పేపర్లతో అనుమతి ఇవ్వడం సరైన పద్ధతి కాదని ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు అన్నారు. సోమవారం ఉపకులపతి వెంకట బసవరావును(రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్స్ ఫెడరేషన్) నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ వర్సిటీ అధికారులు లోపాయి కారి ఒప్పందం చేసుకుని అనుమతులు మంజూరు చేస్తున్నారని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కూడా తూతూ మంత్రంగా చేపట్టారని అన్నారు. విద్యార్థి నాయకులు బాలాజీ, సాయి, వీరేంద్ర, బాబు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో కృష్ణాష్టమి వేడుకలు

కోడుమూరు రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్ల మజరా కొత్తపల్లి గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. మూడురోజులుగా శ్రీకృష్ణుడి విగ్రహానికి గ్రామస్థులు పూజలు నిర్వహించారు. సోమవారం స్వామి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి మేళతాళాల మధ్య వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ సద్దల బాలకృష్ణ, ఉపసర్పంచ్ పసుల చిన్నరాముడు, ఆంజనేయులు, బావన్న, విశ్వనాథం, శివక్రిష్ణ పాల్గొన్నారు.

చీకటి జీవోను రద్దు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లోకి ప్రవేశించరాదని ప్రభుత్వం విడుదల చేసిన జీవోను రద్దు చేయాలని వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి విద్యార్థి సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి వినతి పత్రాలు సమర్పించారు. జీవో కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కటారుకొండ సాయికుమార్, బీసీ విభాగం సిటీ ప్రెసిడెంటు బబ్లూ, చిన్నరాజు, మహేష్, వేణు, రాజు పాల్గొన్నారు.

లద్దగిరి సొసైటీ పాలకవర్గం ఏర్పాటు

కోడుమూరు రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పాలకవర్గం సోమవారం ఏర్పా టైంది. సొసైటీ చైర్మన్‌గా పట్టె కృష్ణుడు, డైరెక్టర్లు సద్దల బాలరాజు, గుడిసె జయరాముడు ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ సీఈవో దేవకుమార్ పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ పట్టె కృష్ణుడు మాట్లాడుతూ సొసైటీ పరిధిలో రైతులు ప్రజలకు రాజకీయాలక తీతంగా రుణాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చూస్తానని తెలిపారు. వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన టీడీపీ నాయకులు, రైతులు చైర్మన్, డైరెక్టర్లను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆదాం బాషా, సద్దల శ్రీనివాసులు, కున్నూరు మధు, సుధాకర్ పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిలిచిన వర్షం నీరు

గూడూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గూడూరు తహసీల్దార్ కార్యాలయం చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. కురుస్తున్న వర్షాలకు తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో వర్షం నీరు నిలిచిపోయింది. తహసీల్దార్ కార్యా లయం ఆవరణలోనే మండల పరిషత్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖ, వసతి గృహం వంటి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. అయితే వర్షం కురిసిందంటే చాలు గూడూరులోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో వర్షం నీరు నిలిచిపోతోంది. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు అవస్థలు తప్పడం లేదు. వర్షం నీరు నిలబడకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వద్దన్నా వర్షం..

రైతుకు నష్టం

- ఎడతెరిపిలేని వర్షాలతో నీట మునిగిన పొలాలు
- పత్తికొండలో టమోటా, దేవనకొండలో పత్తి, వేరుశనగ, ఆముదం

దేవనకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతినే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్‌లో ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. పత్తి 45వేల ఎకరాల్లో, వేరుశనగ 12 ఎకరాల్లో, ఆముదం 2వేల ఎకరాల్లో సాగు చేశారు. పత్తి సాగుకు ఎకరాకు రూ.25వేలు, వేరుశనగలో రూ.30వేలకు పైగా పెట్టుబడి అవుతుంది.

పొలాల్లో నీరు నిలిచి..

వరుసగా కురుస్తున్న వర్షాలతో పొలాల్లో నీరు నిలిచింది. దీంతో పత్తిలో పూత, కాయలు రాలిపోతున్నాయి. ఉన్న కాయలపై నల్లటి మచ్చలు వస్తుండటతో రైతులు లబోదిబో మంటున్నారు. అలాగే వేరుశగ కోతకు వచ్చే సమయంలో వర్షం కురవడంతో పంటకు బూజు వచ్చింది. తేమ శాతంతో మమవేరుశనగ విత్తనాలకు భూమిలోనే మొలకలు వస్తుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. రూ.వేలు ఖర్చు చేసి పంటలు సాగు చేస్తే ఇలా అయిందని రైతులు ఆవేదనన వవ్యక్తం చేస్తున్నారు. తేమతో మొక్కలు ఎర్రబారి దిగుబడి తగ్గే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పూత, పిందె రాలిపోతోంది..

పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పత్తి పంటలో పూత, పిదె రాలుతోంది. ఉన్న పత్తికాయపై నల్లమచ్చ వచ్చింది. ఇలా అయితే దిగుబడి తగ్గి నష్టం వస్తుంది. ప్రభుత్వం ఆదుకోవాలి. **- రాజశేఖర్ గౌడ్, నేలతలమర్రి**



దేవనకొండలో రాలిన పత్తి పూత, పిందె

జాగ్రత్తలు పాటించాలి : ఏవో



దేవనకొండలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏవో ఉషారాణి

అధిక వర్షాల నేపథ్యంలో పంటలు నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో ఉషారాణి సూచించారు. సోమవారం ఆమె దేవనకొండ పరిసరాల్లో పత్తి పంటను పరిశీలించారు. వర్షం నీటిని బయటకు రంపాలన్నారు. పోషకాల కోసం పోటాషియం నైట్రేట్ 20 గ్రాములు, మెగ్నిషియం 10 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పూత, పిందె రాలకుండా 20 లీటర్ల నీటిలో ప్లానోఫిక్స్ 4 ఎంఎల్‌ను కలిపి పిచికారీ చేయాలని, మొక్కలు, కాయలు నల్లబడితే 2 గ్రాములు కార్బండిజం, 2గ్రాములు మంకోజెబ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే అముదం పంటలో కంకిపై బూజు తెగుళ్ల వస్తే లీటరు నీటికి 2 గ్రాములు కార్బండిజం లేదా 2 గ్రాములు టేబుకనజోల్ కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

దెబ్బతిన్న టమోటా..

పత్తికొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వానతో పంటలు దెబ్బ తింటున్నాయి. డివిజన్ పరిధిలో పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి, మద్దికెర మండలాలు ఉన్నాయి. ఖరీఫ్‌లో 83వేల హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేశారు. ఈఏడాది 5వేల ఎకరాల్లో టమోటా సాగైనట్లు అంచనాలు ఉన్నాయి.



టమోటా కాయలపై మచ్చలు

టమోటాకు మచ్చలు..

ఎడతెరిపిలేని వర్షాల ప్రభావంతో నేలలో తేమ అధికమై పంటకు తెగులు సోకింది. దీంతో మొక్కలు దెబ్బతింటున్నాయి. అలాగే వచ్చిన కాయలపై మచ్చలు రావడంతో దిగుబడి తగ్గే అవకాశముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడెకరాల్లో టమోటా సాగు చేశా



గతేడాది మంచి దిగుబడులు వచ్చి, ధర కూడా రావడంతో ఈ ఏడాది మూడెకరాల్లో టమోటా సాగుచేశా ఎడతెరిపి లేని వర్షాలతో పంట దెబ్బతింది. వర్షం తగ్గితే మందులను పిచికారీ చేసే అవకాశం ఉంది. **- చింతకాయల రామాంజి, పత్తికొండ**

పిచికారీ మందులు చల్లాలి: వెంకటరాముడు, ఏవో

అధిక వర్షాలతో టమోటా మొక్కలు వేరుతెగులు బారినపడి ఎదుగుదల ఆగిపోతుంది. వర్షాలు తగ్గిన అనంతరం 19-19-19తోపాటు ఫార్ములా 6ను (మ్యాక్స్) లీటర్ నీటిలో 3గ్రాములు కలిపి వేరుభాగం తడిచేలా పిచికారీ చేయాలి. కాయలపై మచ్చల నివారణకు ట్రైకోడర్మావిరడే లీటరు నీటిలో 5గ్రా, లేదా కాపర్‌ఆక్సిక్లోరైడ్ లీటరు నీటిలో 3గ్రా, లేదా కాపర్‌ఆక్సిక్లోరైడ్ తో కాసుగమైసిన్ లీటరు నీటికి 1.5గ్రా. కలిపి కాయ తడిచేలా పిచికారీ చేయాలి.

హాస్టల్‌లో మురుగు తొలగించాలి



అధికారులతో మాట్లాడుతున్న విద్యార్థులు

మద్దికెర ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సానిక బీసీ హాస్టల్‌లో మురుగును తొలగించాలని విద్యార్థులు కోరారు. సోమవారం సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఉప సర్పంచ్ కవిరెడ్డి కృష్ణ బీసీ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది తమ సమస్యలను తెలుపుతూ 200 మంది విద్యార్థులు ఉన్నారని, స్నానపు గదుల నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో దుర్గంధం వస్తోందన్నారు. స్పందించిన సర్పంచ్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, టీడీపీ నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, మీసేవ భీమ్‌రాజు ఉన్నారు.

డీఈవో విద్యార్హతపై విచారించాలి



మాట్లాడుతున్న షాబీర్ బాషా

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డీఈవో శామ్యూల్ పాల్ విద్యార్హతపై విచారణ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు షాబీర్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ డీఈవోకు బీఈడీ లేకున్నా పదోన్నతి పొందారన్నారు. కారుణ్య నియామకం కింద, డిగ్రీ అర్హతతో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి పదోన్నతి పొందారన్నారు. నాయకులు దస్తగిరి శేఖర్ శివ మోహన్ ఆశోక్ వీరేంద్ర హాజీ పాల్గొన్నారు.

పంట నష్టం నివేదిక పంపుతాం



పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏవో

మద్దికెర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పది రోజుల నుంచి కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట నషకటం వివరాలు సేకరించి జిల్లా అధికారులకు పంపుతామని తహసీల్దార్ గుండాల్ నాయక్, ఏవో రవి అన్నారు. సోమవారం మద్దికెర, బురుజుల గ్రామాల పొలాలను పరిశీలించారు. మండలంలో 7,500 హెక్టార్లలో సాగు చేయగా, 50 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, మరో రెండు రోజుల పాటు పరిశీలించి నివేధిక తయార చేస్తామన్నారు. పంటలు నష్టపోయిన రైతులు సమీప రైతు సేవా కేంద్రాల్లో లేదా రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. సిబ్బంది ఆనంద్, వీఆర్వో రంగస్వామి, తదితరులు ఉన్నారు.

సంతకం చేసి వెళ్లిపోతున్నారు!

- హొళగుంద సచివాయ సిబ్బంది ఇష్టారాజ్యం



సచివాలయ సిబ్బంది లేరని చూపుతున్న ప్రజలు

హొళగుంద, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయం-4లో ముగ్గురు ఉద్యోగులు పనిచేస్తున్నారు. కాగా సోమవారం మధ్యాహ్నం 12:30 దాటినా ఎవ్వరూ లేరు. పని నిమత్తం వచ్చిన స్థానికులు రాజు, సిద్దిక్, ఉమయ్య ఎదురుచూసి వెనుదిరిగారు. కాగా అటెండ్స్ రిజిస్టర్‌లో హాజరైనట్లు సంతకాలు చేసి వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి.

కార్పొరేట్‌తో వ్యవసాయం పతనం




నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు

దేవనకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలోకి కార్పోరేట్ సంస్థలు వస్తే వ్యవసాయ రంగం పతనం తప్పదని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, సీపీఐ మండల కార్యదర్శి నర్సారావ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద 'క్విట్ కార్పోరేట్' నిరసన తెలిపారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకోవాలని పీఎం మోదీపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఇలా చేస్తే 80 శాతం ప్రజలకు నిరుద్యోగంతో ఆకలి చావులు తప్పవన్నారు. కార్యక్రమంలో కండప్ప, కృష్ణ, రాజశేకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికకు సమాయత్తం

- వార్డు ఓటరు జాబితా సిద్ధం చేస్తున్న అధికారులు



ఓటరు జాబితాను రూపొందిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆదోని టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24వ వార్డు కల్లుబావి కౌన్సిలర్ ఉప ఎన్నికకు అధికారులు సమాయత్తమవుతున్నారు. కౌన్సిలర్ రామ లక్ష్మమ్మ ఇటీవల మృతిచెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈసీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో ఇన్‌చార్జి అసిస్టెంట్ సీటీ ప్లానర్ బాలమద్దయ్య ఆధ్వర్యంలో సిబ్బంది రాఘవ, సోమన్న తదితరులు ఓటర్ల లిస్టును రూపొందిస్తున్నారు. ఈనెల 20వ తేదీలోగా ఓటర్ల జాబితాను ప్రకటించాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశించడంతో చర్యలు తీసుకొంటున్నట్లు బాల మద్దయ్య తెలిపారు.

ఆదోనిని రెండో ముంబైగా మారుస్తాం

- పార్టీలకతీతంగా పట్టణాభివృద్ధి
- ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు ప్రమాణం



నాయకులను సన్మానిస్తున్న కార్యకర్తలు

ఆదోని, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని రెండో ముంబైగా మారుస్తామని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నిరు. సోమవారం మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఎమ్మెల్యే పార్థసారథి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మీనాక్షినాయుడు మాట్లాడుతూ కార్యకర్తగా ఉంటూ, రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన బీటీ నాయుడు ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణం చేయడం హర్షణీయమన్నారు. పార్టీలకతీతంగా పనిచేస్తేనే ఆదోని అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనుభవజ్ఞుడైన మీనాక్షి నాయుడు సహకారంతో తాను కూటమి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానన్నారు. తాను నిధులు తెస్తే 36 మంది వైసీపీ కౌన్సిలర్లు అడ్డుకుంటే పట్టణం ఎలా అభివృద్ధి చెందుతుని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అవకాశం ఇచ్చారన్నారు. పాత ఓవర్ బ్రిడ్జి స్థానంలో నూతన వంతెన నిర్మాణం, తాగు నీటి సమస్య, బసాపురం ఎస్ఎస్ ట్యాంకు, రోడ్లు, డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పార్టీ నాయకులు, గజమాలతో సన్మానించారు. కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, గుడిసె కృష్ణమ్మ, ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, భాస్కర్‌రెడ్డి, రంగస్వామి నాయుడు, భూపాల్‌చౌదరి, విట్టా రమేష్ పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని రక్షించుకోవాలి



దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కంపెనీల నుంచి వ్యవసాయాన్ని రక్షించుకోడానికి పోరాడాలని రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య రైతులకు పిలుపునిచ్చారు. సోమవారం పత్తికొండలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను ఊరేగించి దహనం చేశారు. భారత ప్రభుత్వం సామ్రాజ్యవాద దేశాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలపై పార్లమెంటులో చర్చించాలన్నారు. నాయకులు సురేంద్రకుమార్, రాజాసాహెబ్, తిమ్మయ్య, కారుమంచి, రామాంజినేయులు పాల్గొన్నారు.

శుచితో కూడిన భోజనం పెట్టాలి

ఆదోని టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో ప్రజలకు శుచితో కూడిన భోజనం పెట్టాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ సూచించారు. సోమవారం పట్టణంలోని మూడు అన్న క్యాంటీన్లను పరిశీలించారు. భోజనం చేస్తున్న వారిని ఆహార పదార్థాలను ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకొన్నారు.



క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

అర్హతలేని వారితో వైద్య సేవలు..

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రుల్లో అర్హత లేనివారితో వైద్య సేవలు అందిస్తున్నారని నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు ఖాజా మెయినుద్దీన్ ఆరోపించారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చాలా ఆసుపత్రుల్లో ఇంటర్, డిగ్రీ పాస్ కానివారికి తక్కువ జీతాలు ఇచ్చి పనిచేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముజీబ్ భాష, రాహుల్ ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విశ్రాంత ఏజీఎం మృతి



రామ్మోహన్(ఫైల్)

పత్తికొండ/టౌన్ ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు విశ్రాంత ఏజీఎం బి.రామ్మోహన్(61) సోమవారం మృతిచెందారు. ఆయన కెడీసీసీబీలో సాధారణ ఉద్యోగిగా చేరి మేనేజర్ స్థాయికి ఎదిగారు. ఏజీఎంగా కర్నూలు ప్రధాన కార్యాలయంలో పనిచేసి గతేడాది పదవీ విరమణ పొందారు. ఆయనకు బార్య విజయలక్ష్మితోపాటు కుమారులు సిద్దార్థ, ఉత్తేజ్ ఉన్నారు.

పింఛన్లను పునరుద్ధరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తుగ్గలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని సీపీఐ నాయకుడు శ్రీరాములు, దివ్యాంగుల సంఘం నాయకురాలు ప్రసన్నకుమారి డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి, డిప్యూటీ ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.

మరమ్మతులు చేయాలి

ఆస్పరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 33 గ్రామాల్లో రోడ్లకు మరమ్మతులు చేయాలని సీపీఐ కార్యదర్శి బాలకృష్ణ, వైసీపీ నాయకులు మహానంది, ప్రకాష్ కోరారు. సోమవారం తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో గీతావాణికి వినతి పత్రం అందించారు.

సమస్యలను పరిష్కరించాలి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుజరాతీ పాఠశాలలో ఉన్న బీసీ బాలికల వసతి గృహ విద్యార్థినుల సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి ఉమా మహేష్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. హాస్టల్ ప్రహరీ చుట్టూ కొందరు వెదురు బొంగులు వేశారని, విషసర్పాలు వస్తున్నాయని తెలిపారు. గోవింద్, వీరేష్, నరసింహ పాల్గొన్నారు.


అధికారులను సంప్రదించాలి

తుగ్గలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాల ప్రభావంతో పంటలు మునిగిన రైతులు అధికారులను సంప్రదించాలని తహసీల్దార్ రవి సూచించారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలిపోయిన బాధితులకు నష్టం వాటిలితే అధికారులకు తెలియజే యాలన్నారు.

పింఛన్ ఇవ్వండి సారూ..

- దివ్యాంగుడి ఆవేదన

మద్దికెర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఈ ఫోటోలో కనిపిస్తున్న దివ్యాంగుడి వ్యక్తి మండల కేంద్రం కవిరెడ్డి వీధికి చెందిన కవిరెడ్డి గోపాల్. కవిరెడ్డి వీధికి చెందిన దివ్యాంగుడు. గతంలో పింఛన్ అందేదని ఏమైందో ఏమో గానీ తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు పుట్టుకతోనే పోలియో వచ్చి ఒక చేయి, ఒక కాలు వైకల్యమైందని, సదరం సర్టిఫికెట్‌లో 80 శాతం వైకల్యం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో స్వర్ణలత మాట్లాడుతూ మండలంలో మొత్తం 71 పింఛన్లను రద్దు చేశారని, 8 వృద్ధాప్య పింఛన్ల కింద, మిగతా 63 దివ్యాంగ పింఛన్లన్నారు. దివ్యాంగుడు ఈ నెల 25వ తేదీ లోపు కర్నూలు సదరం క్యాంప్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



పింఛన్ ఇవ్వాలంటున్న గోపాల్

అర్జీలను పరిష్కరించండి

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిచాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో డివిజన్‌లోని మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. డీఎల్‌పీవో తిమ్మక్క, డీఎల్ డీవో బాలకృష్ణారెడ్డి, సర్వేయర్ వేణుసూర్య, ఆర్టీఓ ఏవో రమాదేవి, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ షఫీవుల్లా, హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, బాబు, రుద్రగౌడ్ పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

- జేడీఏ వరలక్ష్మి



పత్తి పంటను పరిశీలిస్తున్న జేడీఏ

ఆదోని రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని రైతులు ఆందోళన చెందవద్దని జేడీఏ వరలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఏడీఏ బాలవర్ధిరాజు, ఏవో సుధాకర్‌తో కలిసి పెద్దహరివాణం రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి, రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె అధికారులతో కలిసి పత్తి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలమేరకు తగిన మోతాదులో మాత్రమే ఎరువులు, యూరియా ఉపయోగించాలన్నారు. అధికంగా వాడితే పంటకు తెగుళ్ల సోకి, పురుగులు పడతా యని దిగుబడి తగ్గుతుందన్నారు. పొలాల్లోని నీటిని బయటకు పంపాలన్నారు.

ఆస్తులను రక్షించాలి

ఆదోని టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని హనుమాన్ నగర్ కాలనీలోని రాజ రాజేశ్వరి ఆలయ స్థిర, చర ఆస్తులను కాపాడాలని బీజేపీ నాయకులు రసాలే గోవిందరావు, నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ ఆయానికి రూ. వందకోట్ల విలువ చేసే ఆస్తులు, భక్తులు సమర్పించిన బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయని వీటిని ఓ పార్టీకి చెందిన కొందరు గమాయం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం ట్రస్ట్ ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. మహాదేవ, నాగార్జున, మహబూబ్ బాషా ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆదుకునేందుకే జనసేవాదళ్

పత్తికొండ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విపత్తు సమయాల్లో ప్రజలను ఆదుకోవడమే జనసేవాదళ్ లక్ష్యమని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. సోమవారం ఆదోని రోడ్డులోని బీఈడీ కాలేజీ ఆవరణలో పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల జనసేవాదల్ క్యాంపు నిర్వహించారు. పార్టీ పతాకాన్ని రామచంద్రయ్య ఆవిష్కరించారు. ఆపద సమయాల్లో ప్రజలను రక్షించేందుకు శిక్షణ ఇస్తున్నామని, సంఘవిద్రోహ శక్తుల నుంచి బాధితులను కాపాడతామన్నారు.

సమస్యలతో సతమతం



వినతి పత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

ఆలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉరుకుంద ఈరన్న కొట్టాల కాలనీవాసులు సమస్యలతో సతమతమవుతున్నారని మండల కో ఆప్షన్ సభ్యుడు బాషా, వైసీపీ నాయకుడు భాస్కర్‌నాయుడు కోరారు. సోమవారం ఎంపీడీవో మద్దిలేటి స్వామికి కాలనీవాసులతో కలిసి వినతి పత్రం అందించారు. డ్రైనేజీలో తాగునీటి పైపు ఉండటంతో నీరు కలషితమై వ్యాధులు వస్తున్నాయన్నారు. ఇళ్లల్లోకి వర్షపునీరు వస్తోం దని, పోలీస్ క్వార్టర్స్ వెనక నుంచి నజీర్ ఇంటి వరకు కొత్త మంచినీటి పైపులైన్ వేసి, డ్రెయినేజీలు నిర్మిం చాలని కోరారు. జీరాగౌడప్ప, ఆకుల గుండయ్య, వినోద్, జాన్ పాల్గొన్నారు.

ఉరుకుంద ఈరన్నస్వామికి చక్రస్నానం



ఉరుకుంద ఈరన్నస్వామికి పూజలు చేస్తున్న పూజారులు

కోసిగి ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి నామస్మరణతో భక్తులతో పరవశించిపోయాయి. సోమవారం ఉరుకుంద ఈరన్నస్వామికి తుంగభద్రనది ఒడ్డున ఈవో వాణి ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి చక్రస్నానం చేయించారు. స్వామివారి పల్లకోత్స వానికి పూజలు చేశారు. మంత్రాలయం టీడీపీ యువ నాయకులు ఎం.రామకృష్ణారెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డిలు పల్లకోత్సవంలో పాల్గొన్నారు. కోసిగి సీఐ మంజునాథ్ ఆధ్వర్యంలో కోసిగి, పెద్దకడు బూరు ఎస్ఐలు హనుమంతరెడ్డి, నిరంజన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది బందో బస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్లబండ సహకార సంఘం చైర్మన్ నాడిగేని అయ్యన్న, వెంకటేశ్, తోవి రామకృష్ణ, నాడిగేని చిన్నతాయన్న, చింతలగేని నర్సారెడ్డి, కురువ అయ్యన్న, రామిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన జనం

మంత్రాలయం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వగ రూరు గ్రామంలో వెలసిన నరసప్ప తాత (లక్ష్మీనరసింహ స్వామి) రథోత్సవం వైభవంగా సాగింది. సోమవారం రాజకీయాలకు అతీతంగా నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చెరువుకట్ట నరసప్పస్వామిని రథంపై అధిష్టించి ఊరేగిం చారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, కల్లుదేవకుంట సొసైటీ చైర్‌పర్సన్ రాగమ్మ, సర్పంచ్ లింగారెడ్డి, టీడీపీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, గోపాల్ రెడ్డి, లిం గప్ప, వీరారెడ్డి, గోవర్దన్ రెడ్డిలు పాల్గొన్నారు.

మఠానికి బంగారం విరాళం



బంగారు ఆభరణాన్ని పరిశీలిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి హైదరాబాదు చెందిన వెంకటేశ్, ప్రమోదినీ దంపతులు 12 గ్రాముల బంగారాన్ని సమర్పించారు. వారి తరుపున అక్క శ్రీదేవి, బావ అరుణ్ కుమార్ పీఠాధిపతికి సోమవారం అందజేశారు. దాతలకు స్వామి పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి, పరమేషాచార్, రంగప్పఆచార్, పవన్ కుమార్, తంబిస్వామి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గోనెగండ్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చచేస్తోందని టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు రామాంజినేయులు, బేతాలబడేసా అన్నారు. గోనెగండ్లలోని పార్టీ కార్యాయలంలో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం అమలు చేయడంతో మహిళలు అనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అన్ని వర్గా లకు ప్రభుత్వం న్యాయం చేస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తోంద న్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ షేక్షావలి, రంగస్వామినాయుడు, అక్బర్‌బాషా, శ్రీధర్, రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ రంగముని, రాంపురం రఫీక్, మేకల మునెప్ప, కడపల వెంకటేష్, ఆరేళ్ల రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి: సీపీఐ

నందవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టరును సోమవారం నందవరంలో విడుదల చేశారు. పంపన్న గౌడ్ మాట్లా డుతూ ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణం, గురురాఘవేంద్ర ప్రాజెక్టుల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి జిల్లా పశ్చిమ ప్రాంత వ్యవసాయాన్ని మెరుగు పరచాలన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి రూ.20 కోట్లు నిధులు కేటాయించాలన్నారు. ఆగస్టు 21 నుంచి 25 వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ నాయకులు గిడ్డయ్య, ఏఐటీయూసీ కార్యదర్శి విజేయేంద్ర, శాంతప్ప, రామలింగడు, నాగన్న, ముని, పాండు పాల్గొన్నారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆర్‌యూఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్, ఆర్‌పిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రీది డిమాండ్ చేశారు. సోమవారం డిప్యూటీ డీఈవో వెంకట రామిరెడ్డి వినతి పత్రం అందజేశారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.



డిప్యూటీ డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

టీడీపీ వర్సెస్ వైసీపీ

• సూపర్ సిక్స్ పథకాలపై వైసీపీ సభ్యుడు ఆరోపణలు
• మైక్ లాక్కున్న టీడీపీ సభ్యులు
• వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఎమ్మిగనూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైసీపీ, కూటమి సభ్యులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై వైసీపీ సభ్యుడు శివప్రసాద్ ఆరోప ణలు చేయటంతో కూటమి సభ్యులు అడ్డుకున్నారు. అతడి చేతిలో మైక్ లాక్కొనడంతో వైసీపీ సభ్యులు పోడియం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలతో కంగుతిన్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు ఇరుపార్టీల సభ్యులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. అజెం డాలో ప్రవేశపెట్టిన 23 అంశాలను ఆమోదిస్తున్నట్లు వైస్‌చైర్మన్ నజీర్ తెలిపారు. పట్టణంలో రెండు కూడళ్లలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటు న్నామని, మహనీయులు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి లభించిందన్నారు. అలాగే స్థలదాత హసన్‌బేగ్ విగ్రహాన్ని గోనెగండ్ల సర్కిల్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. కాంట్రాక్టర్లకు రూ. ఐదు కోట్లు బిల్లులు బకాయిలు ఉన్నాయని అవి చెల్లించే విధంగా చర్య లు తీసుకోవాలని వైస్‌చైర్మన్ కోరారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుపై ప్రభుత్వానికి టీడీపీకౌన్సిలర్లు కృతజ్ఞతలు తెలుపుతుండగా వైసీపీ కౌన్సిలర్ అభ్యంతరం తెలిపారు. దాంతో ఇరు పార్టీల సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోడియం ముందుకు వెళ్లడంతో చైర్మన్ డాక్టర్ రఘు సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో సభ్యులు ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. సమావేశంలో వైసీపీ, టీడీపీ సభ్యులు బజారి, కేశవరెడ్డి, కాశీం బేగ్, అంపమ్మ, వైస్‌చైర్మన్ దివ్యకళ, స్వాతి, సరోజమ్మ వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టారు. పట్టణం లో ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తెచ్చిన సమస్యలను ఎప్ప టికప్పుడు పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. ఐల్యాండ్‌ల ఏర్పాటుపై అందరితో చర్చించి ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామదాసు గౌడ్, కౌన్సిలర్లు స్వా తి, సరోజమ్మ, ఇసాక్, వాహీద్, అమాన్, దయాసాగర్, శివప్రసాద్, డీఈలు నీరజ, నాయక్, టీపీఓ రాజేష్, ఏఈ శరత్, శ్రీనివాసులు పాల్గొన్నారు. కాగా, టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఎన్నికైన టీడీపీ నాలుగో వార్డు కౌన్సిలర్ రామదాసు గౌడ్‌ను తోటి సభ్యులు ఘనంగా సన్మానించారు.



వైసీపీ సభ్యుడి చేతిలో నుంచి మైకు లాక్కుంటున్న టీడీపీ సభ్యుడు

రోగులకు మెరుగైన వైద్యసేవలు: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. వైద్యసిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా హెచ్‌డీఎస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనం తరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోనే డెలివరీ లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి మొదటి స్థానంలో ఉందన్నారు. ఆదివారం ఆస్పత్రిలో ఏడు డెలివరీలు చేయగా, ఆసుపత్రికి తాళం వేశారని తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం ఓటి (ఆపరేషన్ థియేటర్) ఓల్డ్ బ్లాక్‌లోనే కొనసాగుతోందని, కొత్త బ్లాక్‌లో ఉన్న వైద్య పరికరాల భద్రత దృష్ట్యా గదికి తాళం వేశారన్నారు. దానిని కొందరు ఆసుపత్రికి తాళం వేశారని, వైద్య సిబ్బంది లేరని తప్పుడు సమాచారం ప్రజలకు చేరవేయడం మంచిది కాదన్నారు. ఆసుపత్రి ప్రతి ష్ట దెబ్బ తీయడం సరికాదన్నారు. మెరుగైన సౌకర్యాల కోసం ప్రభు త్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ కోసం కేంద్రానికి ప్రతిపాదన పంపామన్నారు. ఆసుపత్రిలో సరిపడు సిబ్బం దిని నియమిస్తున్నట్లు తెలిపారు. సెక్యూరిటీ సిబ్బందిని కూడా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆస్పత్రి సూప రింటెండెంట్ డాక్టర్ సుధా, వైద్యులు చిరంజీవి, మల్లికార్జున, సుజిత తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సుధాతో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

యువత వ్యాపార రంగంలో రాణించాలి: బీవీ

ఎమ్మిగనూరు: యువత వ్యాపార రంగంలో రాణించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వీవర్స్ కాలనీలో దొడ్డిమేలకకు చెందిన హనుమంతు, మల్లికార్జునలు ఏర్పాటు చేసిన డెయిరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం యువతకు ఉపాధిఅవకాశాలు కల్పించేందుకు వివిధ రంగా ల్లో నైపుణ్య శిక్షణ ఇస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ నాయకులు కాశీం వలి, గోపాల్, నాగ రాజు, కౌన్సిలర్లు ఇసాక్, అమాన్, శ్రీను, నాగరాజు ఉన్నారు.

పొంగి పొర్లిన చాపవంక

• వర్షాలతో నష్టపోతున్న రైతులు

కోసిగి ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగితో పాటు అన్ని గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం భారీగా వర్షం పడటంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కోసిగిలోని రైల్వేగేటు సమీపంలోని ఉరుకుంద రోడ్డులో ఉన్న చాపవంక పొంగిపొర్లడంతో వాహనాలు భారీగా రోడ్లపైనే నిలిచిపోయాయి. దీంతో కోసిగిలో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. శ్రావణమాసం నాలుగో సోమవారం, ఉరు కుంద ఈరన్నస్వామి పల్లకోత్సవం ఉండటంతో అదే రోడ్డు గుండా వందలాది వాహనాలు ఉరుకుందకు, కందుకూరు గ్రామాలకు వెళ్లే భక్తుల వాహనాలు చాపవంక ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడే రోడ్డు గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పొలాల్లో పంటలు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉల్లి రైతులు అధిక వర్షానికి చేతికి వచ్చిన పంట కళ్లముందే కుల్లిపోతుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్డీఎస్ ఆనకట్టపై ఉధృ‘తుంగ’ వరద: మండలంలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు తుంగభద్రమ్మ పోటెత్తింది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి 1.20 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో పాటు ఎగువ రాష్ట్రమైన కర్ణాటక దిగువన భారీ వర్షాలు పడుతుండటంతో తుంగభద్ర నదికి వరద నీరు పోటెత్తింది. ఆర్డీఎస్ ఆనకట్టపై నాలుగు అడుగుల మేర నీరు దిగువకు ప్రవహిస్తోంది. సోమవారం కోసిగి తహసీల్దార్ వేణుగోపాల్ నది ప్రవాహాన్ని పరిశీలించి నదితీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, నదితీర గ్రామాల్లో దండోరా వేయించామని తెలిపారు. ఆయన వెంట వీఆర్వో రామాంజనేయులు ఉన్నారు.



కోసిగిలో చాపవంక వద్ద నిలిచిన రాకపోకలు

కూలిన మట్టి మిద్దె



కూలిపోయిన మట్టి మిద్దె

నందవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకవీడు గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బోయ రంగన్నకు చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. ఆ సమయంలో ఐదుగురు కుటుంబ సభ్యులు ఇంటి బయటి భాగంలో నిద్రిస్తు న్నారు. దీంతో ప్రాణపాయం తప్పింది. అయితే ఒక్కసారిగా మిద్దె లోపలి భాగం కూలి శబ్దం రావడంతో కుటుంబ సభ్యు లంతా ఉలిక్కి పడ్డారు. తమకు నూతన గృహాన్ని నిర్మించి ఇవ్వాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గోనెగండ్ల మండలంలో వేరు శనగ పంటలు దెబ్బ తిన్నాయని, అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని ఏవో హేమలత సూచించారు. గోనెగండ్లతో పాటు పలు గ్రామాలలో వర్షానికి దెబ్బతిన్న వేరుశనగ పంటలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంటలో యాజమాన్య పద్ధతు లు పాటించాలని సూచించారు. వర్షానికి ముందు వేరుశనగ పంటను కోయరాదని తుపాన్ వాతవరణం నేపథ్యంలో పంట ను కుప్పలుగా వేసి టార్పాలిన్ కప్పిలు వేసుకోవడం వల్ల నష్ట నివారణ నివారించుకోవచ్చునని తెలిపారు. కాయలు తడిచి రంగులుమారితే పచ్చికాయలు అమ్ముకొని నివారణ చేసు కోవచ్చునన్నారు. పంట పొలంలో వర్షపు నీరు నిలిస్తే అధికారుల సూచనల మేరకు నష్టనివారణ చేసుకోవచ్చునని తెలిపారు. అలాగే మిరప పంట పొలాలలో కూడా అధిక నీరు నిలిచి ఉన్నట్లు అయితే 10 గ్రాములు 19:19:19 ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలన్నారు.

తుంగభద్ర నది పరిశీలన



నదిని పరిశీలించి సూచనలు ఇస్తున్న తహసీల్దార్

నందవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా తుంగ భద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం తహసీల్దారు శ్రీనివా సు లు నాగలదిన్నె దగ్గర ప్రవహిస్తున్న తుంగభద్రనది నీటిని పరిశీలించారు. నాగలదిన్నె, నదికైరవాడి,పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, జోహరాపురం, రాయచోటి, గురుజాల గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. వర్షాలు అధికంగా పడుతుండడంతో తుంగభద్ర నదికి నీరు రావచ్చని ముందు జాగ్రత్తగా అన్ని గ్రామాల్లోని తలారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మట్టి మిద్దెల్లో ఉన్నవారు జాగ్రత్త పడాలన్నారు. ప్రమాదాలు జరిగితే సమచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట డీటీ మహేష్, ఆర్ఐ రవీంద్రరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పత్తి పంట పరిశీలన

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగొట్ల గ్రామంలో వారం రోజులుగా కురిసిన వర్షాలకు తడిసిన పత్తిపం టలను సోమవారం ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏవో శివశంకర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించా లని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

గోనెగండ్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా గోనెగండ్ల మండలంలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు శివాలయం చేరుకొని పూజలు, రుద్రాభిషేకం, మహా మంగళ హారతి, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఎన్నె కండ్ల గ్రామంలో శివాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు భోజనం ఏర్పాటు చేశారు. శ్రావణ మాస చివరి సోమవారం కావడంతో శివాలయాలు, అమ్మవారి దేవాలయాలో భక్తులు సందడి చేశారు.

అక్రమ లే అవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి

'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ఎమ్మిగనూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో అక్రమలేఅవుట్లు వేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఎమ్మిగనూరులో ఎల్ఆర్ ఎస్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అక్రమ లే అవుట్లను సరిచేసుకునేందుకు ప్రభుత్వం ఒక మంచి అవకాశం కల్పించిందన్నారు. జూన్ 30, 2025 వరకు వేసిన నాన్ లేఅవుట్లను ఎల్ఆర్ఎస్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ చేసుకునేందుకు 90 రోజులు గడువు ఇచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 300కు పైగా అక్రమ లే అవుట్లు గుర్తించామన్నారు. ఎల్ఆర్ఎస్ చేసుకోని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ లే అవుట్లను ఉపేక్షించేదిలేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు రాజకీయ ఒత్తిడి తెచ్చినట్లైతే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అక్రమ లే అవుట్లను ఎల్ఆర్ఎస్ చేసే బాధ్యత ఆయా సచివాలయల సెక్రటర్లు తీసుకోవాలన్నారు.

చర్చి నిర్మాణానికి కృషి

నందవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చర్చి నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని హలహర్వి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చిని సోమవారం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేను చర్చి పెద్దలు సన్మా నించారు. ఆయన మాట్లాడుతూ తన వంతుగా రూ.1.5 లక్షలు ఇస్తా నన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. చర్చి వివరాలు అన్ని తనకు ఇవ్వాలని నిర్వాహకులకు తెలిపారు. మాజీ జడ్పీటీసీ ఈరన్నగౌడు, పార్టీ కన్వీనర్ మండల కాశీంవలీ, రైస్‌మిల్ నారాయ ణరెడ్డి, సహకార సంఘం మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, నరసింహులు, శీను, దావీదు, ఎర్రన్న, నాగరాజు, గోవిందు, ప్రభుదాసు, వెంకట్రాముడు ఉన్నారు.

సిరాలదొడ్డిలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలం లోని సిరాలదొడ్డి గ్రామంలో సోమవారం వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాప నను ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మె ల్యే చెన్నకేశవరెడ్డి వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులు రాజకీయ, విద్య, ఆర్థికంగా రాణిం చాలన్నారు. గొడవలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. కార్యక్ర మంలో ఎంపీపీ కేశన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ న్యాయం

టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి



మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి

పెద్దకడబూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తామని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం పెద్దకడుబూరు సహకార సం ఘం సొసైటీ అధ్యక్షుడిగా ఆంజనేయులు, డైరెక్టర్లుగా నరసన్న, అని మేష్ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కొంతమంది వైసీపీ నాయకులు చేసిన అరాచకాలు అన్ని తమకు గుర్తున్నాయన్నారు. సమావేశంలో టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, జనసేనా పార్టీ ఇన్‌చార్జీ లక్ష్మన్న, మల్లికార్జున, సురేష్‌నాయుడు, బాబు రావు, బొగ్గుల తిక్కన్న, మొట్రు రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆందోళన చెందొద్దు

• ప్రతి రైతుకు యూరియాను అందిస్తాం
• వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి



రైతులకు యూరియా అందిస్తున్న జేడీ వరలక్ష్మి

కౌతాళం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్బీకే, ప్రైవేటు ఎరువుల దుకాణా లను జేడీ తనిఖీ చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత ఉందని రైతులు ఆందోళన చెందు తున్న నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించేందుకు వచ్చానన్నారు. అవసర మైన మేరకు యూరియాను అందిస్తామన్నారు. ప్రైవేటు దుకాణాల్లో కూడా నిర్ణయించిన ధరకే ఎరువులను విక్రయిస్తారని, అధిక ధరలకు విక్రయించినట్లు ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. జేడీ వెంట మండల వ్యవసాయాధికారి శేషాద్రి ఉన్నారు.

రెండువేల టన్నుల యూరియాను అందించాలి

కౌతాళం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలానికి రెండు వేల టన్నుల యూరియాను సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాల యంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ రామేశ్వరరెడ్డికి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ముందుగా కురిసిన వర్షాల వల్ల రైతులు మిరప, పత్తి, వేరుశెనగ పంటలను సాగు చేసుకు న్నారన్నారు. పంటలను కాపాడుకునేందుకు ఎరువులను వేద్దామంటే యూరియా దొరకడం లేదన్నారు. కొంతమంది ప్రైవేటు డీలర్లు కృత్రి మ యూరియా కొరత సృష్టిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరో పించారు. ప్రభుత్వం రైతులకు కావాల్సినంత యూరియాను సరఫరా చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉలిగప్ప, వీరేష్, సత్యప్ప ఉన్నారు.